
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
గురువారం 20 నవంబరు 2025

మార్చురీలోనూ..
ముట్టజెప్పాల్సిందే!



- జిల్లా ఆస్పత్రిలో 'పంచనామా' సిబ్బంది కాసుల కక్కుర్తి
- ఫార్మాలిటీల పేరుతో వసూళ్ల పర్వం
- పుట్టెడు శోకంలోనూ ఆప్తులకు తప్పని తిప్పలు
- ఆస్పత్రి వైపు కన్నెత్తి చూడని జిల్లా ఉన్నతాధికారులు

'ఎంత కాలం పని చేశామన్నది ముఖ్యం కాదమ్మా.. ఎంత జేబులో వేసుకున్నామన్నదే లెక్క'.. అన్నట్టుగా జిల్లా ఆస్పత్రి సిబ్బంది రెచ్చిపోతున్నారు. హాస్పిటల్‌కు వచ్చే రోగుల వద్ద వసూలు చేసింది చాలదన్నట్టు.. చివరకు మృతదేహాలనూ వదలడం లేదు. పరీక్షల పేరిట వారి కుటుంబీకుల వద్ద మార్చురీ సిబ్బంది అందినకాడికి దండుకుంటున్నారు. జిల్లా ఆస్పత్రిలో గతంలో మృతదేహాల పరీక్షను పీఎంవోలతో చేయించేవారు. పోలీసు పంచనామా నివేదికల ఆధారంగా వైద్యులు పరీక్షించేవారు. దీంతో అనేక ఇబ్బందులు తలెత్తాయి. ఆ తర్వాత బోధనాసుపత్రిగా మారిన తర్వాత ఫోరెన్సిక్ విభాగాన్ని అందుబాటులోకి వచ్చింది. దీంతో ఇక్కడ అసిస్టెంట్ ప్రొఫెసర్‌ను ఏర్పాటు చేశారు. ఆయన ఆధ్వర్యంలో శవపరీక్షలను నిర్వహిస్తున్నారు. అయితే ప్రతీ నెల కనీసం 70 మృతదేహాలకు పరీక్షలను నిర్వహిస్తూ నివేదికలను అందిస్తున్నారు. ఇక్కడే సిబ్బంది మాయాజాలం చేస్తూ వసూళ్ల పర్వానికి తెర లేపుతున్నారు.

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి)

- ఖమ్మం నగరానికి చెందిన ఓ ఆర్టీసీ ఉద్యోగి మృతి చెందగా.. ఆయన మృతదేహాన్ని బంధువులు వచ్చేంత వరకు మార్చురీలో గల ఫ్రీజర్‌లో పెట్టడానికి అందులోని సిబ్బంది రూ.3వేలు అడిగారు!
- రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఓ వ్యక్తికి సంబంధించి.. పోలీసులు ఫొటోలు తీయించాలంటే ఇక్కడి ఫొటోగ్రాఫర్ రూ.3వేలు డిమాండ్ చేశాడు..
- ఇక్కడి సిబ్బంది పోస్టుమార్టం నిర్వహించాలంటే మృతదేహాన్ని శుభ్రం చేయాలని.. అవి ఇవీ కావాలంటూ ఫార్మాలిటీల పేరుతో రూ. 3 వేల నుంచి 5వేల వరకు వసూలు చేస్తున్నారు.

'నాపని చూడండి.. మీ పని చేసి పెడతా'.. అంటూ ఇక్కడి సిబ్బంది పోలీసుల మధ్యవర్తిత్వంతో పెద్దమొత్తంలో వసూళ్లు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఇదంతా బాహాటంగానే జరుగుతున్నా.. ఎక్కడా ఆనవాళ్లు లేకుండా... చాకచక్యంగా వసూళ్లకు పాల్పడుతున్నారు.

పుట్టెడు శోకంలో తప్పని తిప్పలు!

ప్రమాదంలో మృతిచెందిన దేహాలకు పోస్టుమార్టం నిర్వహించాలంటే ఇక్కడి సిబ్బంది బంధువులను ముక్కుపిండి మరీ వసూలు చేస్తున్నారు. ప్రమాదంలో మృతి చెందితే ఫొటోలు తీయాలంటే ఫొటోగ్రాఫర్‌కు రూ.3వేలు ముట్టజెప్పాలి. ఇక మృతదేహానికి పరీక్షలు నిర్వహించేందుకు, శుభ్రపరచడంతో పాటు ఇతరత్రా వాటికోసం అంటూ పోస్టుమార్టం గది సహాయకులు ఇద్దరు పని చేస్తున్నారు. ఇక్కడ వారు పనిచేయాలంటే రూ.3వేల వరకు ముట్టజెప్పాల్సిందే. లేకుంటే వారి ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వారు అడిగినంత ఇవ్వకుంటే అది లేదు.. ఇది లేదంటూ కొర్రీలు పెడుతున్నారని మృతుల కుటుంబీకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్రిమినల్ కేసుల్లో ... ప్రమాదాల కేసుల్లోనూ విచారణాధికారులతో కుమ్మక్కై భారీగా వసూళ్లు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆరు నెలల క్రితం వరకు ఇక్కడ పనిచేసిన ఓ కాంట్రాక్టు చిరుద్యోగితో వసూళ్లు చేయించి.. పంపకాల్లో తేడాలు రావడంతో అతడిని సాగనంపినట్లు సమాచారం. అంతే కాదు మృతదేహానికి పరీక్షల అనంతరం పార్థీవ దేహాన్ని తరలించడానికి కూడా ఇక్కడ దళారీలు, ఆస్పత్రి సిబ్బంది వసూళ్లకు పాల్పడుతున్నారు.



జిల్లా ఆస్పత్రిలోని మార్చురీ

● ఈ ఏడాది ఇప్పటి వరకు నిర్వహించిన పోస్టుమార్టం నివేదికలు ఇలా..

నెల	మొత్తం
జనవరి	87
ఫిబ్రవరి	52
మార్చి	72
ఏప్రిల్	68
మే	93
జూన్	82
జూలై	65
ఆగస్టు	74
సెప్టెంబరు	70

అంతా ఎస్సారే !

పోస్టుమార్టం నివేదికల్లో వాటిని జారీ చేయడంలో విభాగం అధికారి మాత్రమే జారీ చేయాల్సి ఉంటుంది. కానీ ఇక్కడి హెచ్‌వోడీ ఎప్పుడు అందుబాటులో ఉండకుండా మూడు నెలల పాటు విధులు నిర్వహించే ఎస్సార్‌లకే కీలక బాధ్యతలను అప్పగించారు. ఆయనే అన్ని పనులు చూసుకుంటున్నాడు. వసూళ్లు చేసిన వాటిని వాటాలుగా పంచుకుంటున్నారు.

ఆరోపణలపై దృష్టి సారించాం..
డాక్టర్ ఎం.నరేందర్, జీజీహెచ్ సూపరింటెండెంట్

మార్చురీలో అక్రమంగా వసూలు చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయన్న మాట వాస్తవమే. దీనిపై ప్రత్యేక దృష్టి సారించాం. ఇక్కడ ఫొటోగ్రాఫ్స్ తీస్తూ అక్రమంగా వసూళ్లు చేస్తున్నారన్న నేపథ్యంలో.. అతడిని ఇక్కడికి అనుమతించవద్దని సిబ్బందికి సూచించాం. పార్థీవ వాహనం, అంబులెన్స్‌లోనూ అడ్డగోలుగా వసూళ్లు చేయొద్దని గట్టిగా చెప్పాం. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందితే ఆ దేహాన్ని తరలించేందుకు ఉచితంగా సేవలు అందిస్తున్నాం. ఎవరైనా అక్రమంగా వసూళ్లు చేస్తే.. ఆ సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవు.

ఈసారైనా ఉత్తర ద్వార
దర్శనం దక్కేనా?

- సాధారణ భక్తులకు ఏటా మిగులుతున్న నిరాశ
- చలితీవ్రత నేపథ్యంలో ప్రత్యేక చర్యలు చేపట్టాలి
- ఇంకా ఖరారు కాని టెండర్లు?
- గతేడాది నుంచి ఉత్సవాల చెల్లింపులు మరిచిన వైనం
- నేడు వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లపై కలెక్టర్ జితేష్ సమీక్ష



గత ఏడాది భద్రాచలంలోని గోదావరి నది తీరంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక వసతి

భద్రాచలం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాల సందర్భంగా భద్రాచలం సీతారామచంద్రస్వామి ఉత్తరద్వారంలో స్వామి వారి దర్శన భాగ్యం దొరకడం లేదని, ఈ సారైనా వారికి స్వామి దర్శనం కల్పించాలన్న డిమాండ్ వినిపిస్తోంది. గతకొన్నేళ్లతో పోలిస్తే గతేడాది కలెక్టర్ జితేష్‌వి పాటిల్ పర్యవేక్షణ క్రమంలో వీఐపీ, వీవీఐపీ సెక్టార్లలో వారి వెంట వచ్చే అనుచరుల తాకిడిని నియంత్రించారు. అయినా ఇంకా అది పూర్తిస్థాయిలో చేపట్టాలని రామ భక్తులు ఆకాంక్షిస్తున్నారు. టికెట్లు సైతం భారీ ఎత్తున విక్రయించగా కొద్దిపాటి మిగిలినట్టు అధికార వర్గాలు ఆనాడు తెలిపాయి. ఈసారి సాధారణ భక్తులకు కూడా స్వామి వారిని ఉత్తరద్వారంలో దర్శించే భాగ్యం అధికారులు కల్పించాలని రామ భక్తులు కోరుతున్నారు. గతేడాది అత్యంత ఆహ్లాదకరంగా నిర్వహించిన ఏరు ది రివర్ ఫెస్టివల్‌పై ఈసారి ఎటువంటి కదలిక లేకపోవడం చర్చనీయాంశంగా మారింది. కాగా గతేడాది వినాయక నిమజ్జనాల నుంచి వివిధ ఉత్సవాలు, కార్యక్రమాల సమయంలో చేయాల్సిన చెల్లింపులు ఇంకా జరగలేదని (మిగతా 6వ పేజీలో)



ఇల్లెందులో సందల్ ఊరేగింపు

ఘనంగా ఉర్సే షరీఫ్ వేడుకలు

● అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు - 6లో



రఘునాథపాలెంలో చీరలను పంపిణీ చేస్తున్న మంత్రి తుమ్మల



మాట్లాడుతున్న తుమ్మల నాగేశ్వరరావు

ఆకాశమే హద్దుగా మహిళలు ఎదగాలి

- ఆ దిశగా రాష్ట్ర సర్కారు తోడ్పాటునిస్తోంది
- వారి సంక్షేమమే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యం
- పుట్టింటి సారెగా ఇందిరమ్మ చీరల పంపిణీ
- రఘునాథపాలెంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- చిల్డ్రన్ హోం నిర్మాణ పనులకు శంకుస్థాపన

ఖమ్మం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): మహిళలు ఆకాశమే హద్దుగా ఎదగాలని, వారి అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ఈ ప్రభుత్వం తోడ్పాటునిస్తోందని రాష్ట్ర వ్యవసాయ, చేనేత, జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు పేర్కొన్నారు. ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా రఘునాథపాలెంలో ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రూ.కోటి35లక్షలతో నిర్మించనున్న బాలల సదనం భవనానికి శంకుస్థాపన చేశారు. అనంతరం స్వయం సహాయకసంఘాల మహిళలకు సిరిసిల్ల చేనేత చీరలను మంత్రి తుమ్మల పంపిణీ చేశారు. హైదరాబాద్ తర్వాత రఘునాథపాలెంలోనే స్వయం సహాయక సంఘాల మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీని చేపట్టామన్నారు. ఇది పుట్టింటి చీరగా భావించి ఈ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. సిరిసిల్లచేనేత కార్మికులతో తయారు చేయించిన ఈ చీరలను (మిగతా 8వ పేజీలో)

జైళ్లు.. పరివర్తనకు కేంద్రాలు కావాలి

- ఖైదీల్లో నైపుణ్యాభివృద్ధికీ దోహదం
- జైళ్లశాఖ డీజీ సౌమ్యమిశ్రా
- భద్రాద్రి సబ్ జైల్లో అగర్‌బత్తీల తయారీ కేంద్రం ప్రారంభం
- సీతారామచంద్రస్వామికి ప్రత్యేక పూజలు



అగర్‌బత్తీల తయారీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీజీ సౌమ్యమిశ్రా

భద్రాచలం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జైళ్ల కేవలం నిర్బంధ కేంద్రాలు కాకుండా పరివర్తన, నైపుణాభివృద్ధి కేంద్రాలు కావాలని జైళ్లశాఖ డీజీ సౌమ్యమిశ్రా ఆకాంక్షించారు. భద్రాచలంలోని ప్రత్యేక సబ్ జైల్లో కొత్తగా ఏర్పాటు చేసిన అగర్‌బత్తీల తయారీ కేంద్రాన్ని బుధవారం ఆమె ప్రారంభించారు. తొలుత సౌమ్యమిశ్రా భద్రాచలం సీతారామచంద్రస్వామిని వారి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమెకు దేవస్థానం అధికారులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సౌ మ్యమిశ్రాకు వేద పండితులు వేదాశీర్వచనం అందజేయగా.. ఈవో కె.దామోదర్‌రావు ప్రసాదాన్ని అందజేశారు. అనంతరం సబ్ జైలుకు వచ్చిన ఆమెకు సిబ్బంది గౌరవ వంద నం సమర్పించారు. అనతరం జరిగిన కార్యక్రమంలో డీజీ మాట్లాడుతూ.. పవిత్ర భద్రాచలంలోని వివిధ ఆలయాల్లో భక్తులు సమర్పించే పుష్పాలను సేకరించి వాటి ద్వారా బొగ్గు లేకుండా పర్యావరణహిత అగరబత్తీ లుగా తయారీ చేయనున్నట్టు వెల్లడించారు. కరీంనగర్‌లోని జిల్లా జైల్లో ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేసిన అగరబత్తీల తయారీ కేంద్ర ం విశేష ఫలితాలు సాధించిందన్నారు. ఆ కేంద్రం ద్వారా ఖైదీల్లో క్రమశిక్షణ, పనిపై బాధ్యత, ప్రవర్తనలో సానుకూల మార్పులు స్పష్టంగా కనిపించాయన్నారు. ఆలయ పరిసరాల పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణతో పాటు ఖైదీలకు గౌరవ ప్రదమైన ఉపాధి కల్పించేందుకు ఈ కేంద్రం దోహదపడుతుందని తెలిపారు. పూవుల వ్యర్థాల నుంచి ఖైదీలకు అగరబత్తీలు తయారు చేయడంపై శిక్ష ణ ఇస్తామని సౌమ్య మిశ్రా చెప్పారు. భద్రాచలంలో పర్యావరణహిత (మిగతా 6వ పేజీలో)



కేంద్రంతో మాట్లాడండి..

- ఆంక్షల్లేకుండా పంటలు కొనుగోలు చేయించండి
- అంతేకాని రాష్ట్రప్రభుత్వంపై అబద్ధపు ప్రచారాలు చేయొద్దు
- బీజేపీ, బీఆర్ఎస్‌పై మంత్రి తుమ్మల గరం గరం
- రఘునాథపాలెంలో విలేకరుల సమావేశం

వివరాలు 6లో

పంచాయతీ ఓటర్ల జాబితాలో సవరణకు
షెడ్యూల్ విడుదల

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : త్వరలో గ్రామ పంచాయతీలకు ఎన్నికలను నిర్వహించాలన్న రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయం నేపథ్యంలో ఇప్పటి వరకు ప్రచురించిన ఓటర్ల జాబితాలో సవరణలు చేసేందుకు అవకాశాన్ని కల్పించింది. ఈ ఏడాది జూలై 1న రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించిన ఓటర్ల జాబితా ఆధారంగా పల్లె ఓటర్ల జాబితాను సిద్ధం చేశారు. దానిపై అభ్యంతరాలను స్వీకరించి ఆగస్టు 2న తుది జాబితాను ప్రకటించింది. ఈ నేపథ్యంలో ప్రకటించిన జాబితాలో తప్పులను సరిచేసేందుకు గ్రామ పంచాయతీల ఫొటో ఎలక్టోరల్ రోల్స్‌ను తిరిగి ప్రచురించేందుకు షెడ్యూల్‌ను విడుదల చేసింది. గ్రామపంచాయతీ ఓటర్ల జాబితాలో చిరునామాలు మార్పు లేకుండా జీపీ వార్డు తప్పు మ్యాపింగ్‌ను సరిదిద్దడానికి 20న దరఖాస్తులు స్వీకరిస్తారు. వాటిని 22 వరకు జిల్లా పంచాయతీ అధికారులు పరిష్కరిస్తారు. 23న గ్రామపంచాయతీ, వార్డులను సూచిస్తూ ప్రకటించనున్నారు. అదే రోజున మారిన ఓటర్ల సంఖ్యను కలుపుకొని పోలింగ్ కేంద్రాలతో తుది జాబితాను ప్రకటించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణికుముదిని బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.

నేత్రపర్వంగా గ్రామోత్సవం



ఖమ్మంఖానాపురంహవేలి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా నగరంలోని భ్రమరాంబ సమేత గుంటు మల్లేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించే ప్రత్యేక పూజల్లో భాగంగా బుధవారం స్వామి వారి గ్రామోత్సవం (ఊరేగింపు) నేత్రపర్వంగా జరిగింది. డప్పు వాయిద్యాలు, కోలాట బృందాలు నడుమ స్వామి వారి ఊరేగింపు సాగింది. భక్తులు అధిక సంఖ్యలో హాజరై ఊరేగింపులో పాల్గొన్నారు. ఆలయం నుంచి ప్రారంభమైన ఊరేగింపు చాకలిబజారు, పీఎస్ఆర్ రోడ్డు, గాంధీచౌక్ వరకు సాగింది. అర్ధరాత్రి 12గంటల వరకు ఊరేగింపు సాగింది. ఊరేగింపు శివనామస్మరణతో మారుమోగాయి. ఆలయ ఈవో చుండూరి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీసుల సహకారంతో ముందస్తు బందోబస్తు ఏర్పాటు చేశారు. జిల్లాలోని పలు శివాలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు తెల్లవారుజాము నుంచే ఆలయాలకు చేరుకొని ఆలయంలో దీపాలు వెలిగించారు. నగరంలోని శ్రీనివాసనగర్, బైపాస్ రోడ్డు చైతన్యనగర్‌లోని అయ్యప్పస్వామి ఆలయాలలో అయ్యప్ప భక్తుల ఇరుముడులతో ఆలయాలు కిటకిటలాడాయి.



గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ఇందిరమ్మ ఇళ్లకు సాంకేతిక లోపం

- మూడు నెలలుగా నిలిచిన గృహ నిర్మాణాలు
- తాజాకొలతలకు సరిపోలని లాంగిట్యూడ్, లాటిట్యూడ్
- దిద్దుబాటు చర్యల్లో అధికారుల అలసత్వం
- లబోదిబోమంటున్న లబ్ధిదారులు



బిల్లు రాక నిలిచిపోయిన నిర్మాణం

దుమ్ముగూడెం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు సాంకేతిక సమస్య అడ్డుపడింది. అప్పు చేసి ఇళ్లు కట్టుకుంటున్న లబ్ధిదారులకు ఈ వ్యవహారం ఆదిలోనే హంసపాదుగా మారింది. నెలల తరబడి సమస్య పరిష్కారం కాకపోవడంతో జరిగిన పనులకు బిల్లులు రావడం లేదు. దీంతో బయట తీసుకున్న అప్పులకు వడ్డీ పెరిగి లబ్ధిదారులకు భారంగా మారింది. తమ సమస్యను అధికారులకు ఎన్నిమార్లు మొరపెట్టుకున్నా పరిష్కారానికి నోచుకోకపోవడంతో ఇందిరమ్మ లబ్ధిదారులు దిగాలు చెందుతున్నారు. ఉమ్మడిజిల్లాకు చెందిన పొంగులేటి శ్రీనివాసరెడ్డి గృహనిర్మాణశాఖ మంత్రిగా ఉన్నా, నెలల తరబడి సమస్య పరిష్కారానికి నోచుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

సాంకేతిక సమస్యతో నిలిచిన బిల్లులు

దుమ్ముగూడెం మండలంలో మొత్తం 1,076 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. వీటిలో 752 నిర్మాణాలు ప్రారంభం కాగా, 511 ఇళ్లు పునాదుల దశలో ఉన్నాయి. కాగా వీటిలో డబ్ల్యూఎల్ రేగుబల్లి, చిననల్లబల్లి, కాశీనగరం, ములకపాడు, గౌరారం గ్రామాల్లో పునాది స్థాయి పనులు పూర్తయిన సుమారు 25 ఇళ్లు మూడు నెలలుగా సాంకేతిక సమస్యతో నిలిచిపోయాయి. పునాది పనులు ప్రారంభించిన నాటి ఇళ్ల నిర్మాణాల లాంగిట్యూడ్(అక్షాంశం), లాటిట్యూడ్(రేఖాంశం)లు తాజా కొలతలతో సరిపోలక పోవడంతో సమస్య మొదలైంది. పునాది నిర్మాణాలు పూర్తయిన వారికి బిల్లులు చెల్లించాలంటే సంబంధిత ఏఈ, పంచాయతీ కార్యదర్శులు తమ ఫోన్ల నుంచి పూర్తయిన పునాదుల ఫొటోలను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. (మిగతా 6వ పేజీలో)

1,160 పాఠశాలలకు రూ. 1.13కోట్లు

- ఏపీసీలకు పాఠశాలల నిర్వహణ గ్రాంట్ విడుదల
- రెండు నెలలకు వినియోగం



బోనకల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): అమ్మ ఆదర్శ కమిటీల ఖాతాలకు పాఠశాలల సౌకర్యాల నిర్వహణ నిధులను విడుదల చేస్తూ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఉత్తర్వులిచ్చారు. జిల్లా వ్యాప్తంగా 1,160 పాఠశాలలకు సంబంధించి రూ. 1,13,78000 నిధులను విడుదల చేశారు. జిల్లాలోని 21మండలాల్లోని 1,160 పాఠశాలలకు సెప్టెంబరు 12 నుంచి నవంబరు 12 వరకు రెండు నెలలకు పాఠశాలల్లో పారిశుధ్య పనులు చేసే వారికి నిధులు ఖర్చు చేయాల్సి ఉంది. టాయ్‌లెట్లను శుభ్రం చేయడం, మొక్కలకు నీళ్లు, పాఠశాల ఆవరణను ఆహ్లాదకరంగా ఉంచే విధంగా చేపట్టే పనులకు గానూ ఈ నిధులను పాఠశాల ఏఏపీసీ సభ్యులు ఖర్చు చేస్తారు. ఇప్పటికే మొదటి విడతలో జూన్ 12 నుంచి సెప్టెంబరు 9వ తేదీ వరకు 3 నెలలకు జిల్లాలోని 1164 పాఠశాలలకు రూ.1.71కోట్లను ఏఏపీసీ ఖాతాలకు జమ చేయగా.. తాజాగా రెండు నెలల కాలానికి నిధులను విడుదల చేశారు.

పరిశుభ్రతను ఖచ్చితంగా అమలు చేయాలి

» విద్యాశాఖ జేడీ, రాష్ట్ర పరిశీలకురాలు వెంకటనర్సమ్మ



పడమటనర్సాపురం ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

జూలూరుపాడు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో పాఠశాలల్లో పచ్చదనం పరిశుభ్రతను ఖచ్చితంగా అమలు చేయాలని విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్, రాష్ట్ర పరిశీలకురాలు బి. వెంకటనర్సమ్మ సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన స్పెషల్ క్యాంపెయిన్ 5.0లో భాగంగా బుధవారం ఆమె జూలూరుపాడులోని ప్రాథమిక పాఠశాల, పడమటనర్సాపురంలోని ఉన్నత పాఠశాలలను సందర్శించారు. రెండు పాఠశాలల్లో తరగతి గదులు, ఆవరణలు, టీఎల్ఎం మేళా, మధ్యాహ్న భోజనం, డిజిటల్ తరగతి నిర్వహణ, మరుగుదొడ్లు తదితరాలను ఆమె పరిశీలించారు. ఉపాధ్యాయులు ఐఎఫ్‌పీ ప్యానల్‌లను సద్వినియోగం చేసుకుంటున్నారా అని ఆరాతీశారు. జూలూరుపాడు ప్రాథమిక పాఠశాలలో స్క్రాప్‌ను తొలగించకుండా తరగతి గదుల్లో నిల్వ ఉంచడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. వీలైనంత త్వరగా ఈ స్క్రాప్‌ను పాఠశాల నుంచి తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంఈవోకి ఆదేశాలు జారీ చేశారు. పడమటనర్సాపురం ఉన్నత పాఠశాలలోని ఆవరణలో రాళ్లు, చెత్త చెదారం నిల్వ ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ కోఆర్డినేటర్లు ఎస్.సైదులు, ఏ.నాగరాజశేఖర్, ఎస్.సతీష్‌కుమార్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సంజీవరావు, లక్ష్మీనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎంతో వీసీకి హాజరైన ఇరు జిల్లాల కలెక్టర్లు



సీఎం వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న మంత్రి తుమ్మల, కలెక్టర్ అనుదీప్

ఖమ్మం కలెక్టరేట్/కొత్తగూడెం కలెక్టరేట్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : కోటి మంది మహిళలకు రెండు దఫాల్లో ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. బుధవారం ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం లాంఛనంగా ప్రారంభించిన ఆయన మంత్రులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీసీలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఉమ్మడి జిల్లా కలెక్టర్లు అనుదీప్ దురిశెట్టి, జితేష్ వి పాటిల్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ భారతరత్న దేశ మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ ఇందిరాగాంధీ 108వ జయంతి సందర్భంగా కోటి మంది మహిళలకు కోటి చీరలు పంపిణీ చేసే కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. గ్రామం నుంచి జిల్లా మహిళా సమాఖ్య వరకు ఎటువంటి డ్రెస్ కోడ్ లేని కారణంగా వారికి గుర్తింపు లేకుండా పోయిందన్నారు.

- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ మహిళా సంఘాల సభ్యులకే కాకుండా రాష్ట్రంలోని తెల్ల రేషన్ కార్డు ఉన్న 18 సంవత్సరాల నిండిన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ చీర పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రివర్యులు ధనసరి అనసూయ (సీతక్క) మాట్లాడుతూ దేశానికి ప్రధాన మంత్రిగా అద్భుతంగా పరిపాలించిన మహా నాయకురాలు ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా ఆమె స్ఫూర్తితో మహిళలంతా ఎదగాలని ఆకాంక్షించారు. ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించాలని, అన్నారు. అనంతరం జల్ సంచయ్-జన్ భాగీదారీ కార్యక్రమంలో జిల్లా సాధించిన జాతీయ అవార్డు సందర్భంగా భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందనలను మహిళా సంఘాల సభ్యులు సత్కరించారు. ఈ సమావేశంలో అధికారులు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొని ప్రసారాన్ని వీక్షించారు.

నేడు మున్నేరు పై రాకపోకల నిలిపివేత

ఖమ్మం క్రైం, నవంబరు19: నేడు గురువారం ఉదయం 6గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు మున్నేరు వంతెన పై వాహనాల రాకపోకలు నిలిపివేస్తున్నట్టు ట్రాఫిక్ సీఐ బెల్లం సత్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తీగల వంతెన నిర్మాణం కొసం భారీ యంత్రాలను ఉపయెగాస్తున్న నేపథ్యంలో ఆంక్షలు విధిస్తున్నట్టు సీఐ తెలిపారు. ప్రజలు గమనించి ఆయా సమయలలో ప్రత్యామ్నాయ మార్గాలలో వెళ్లాలని సూచించారు.

అటవీ సంపదను పరిరక్షించాలి: డీఎఫ్‌వో

జూలూరుపాడు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): అటవీ సంపదను పరిరక్షించే విధంగా సిబ్బంది చర్యలు తీసుకోవాలని డీఎఫ్‌వో కృష్ణాగౌడ్ అన్నారు. బుధవారం ఆయన జూలూరుపాడు అటవీ రేంజ్ పరిధిలోని రాజారావుపేట, వినోభానగర్ అటవీ ప్రాంతాలలో పర్యటించి ప్లాంటేషన్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌డీవో యు.కోటేశ్వరరావు, ఎఫ్‌ఆర్‌వో ప్రసాదరావు, సెక్షన్ ఆఫీసర్ మల్లయ్య పాల్గొన్నారు.

కగార్ పేరుతో బూటకపు ఎన్‌కౌంటర్

» సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు

ఖమ్మం కార్పొరేషన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): సెప్టెంబరు నుంచి కేంద్ర ప్రభుత్వం కాగర్ పేరుతో కర్రిగుట్టల నుంచి మారేడుమల్లి వరకు హత్యాకాండలు చేస్తుందని, లొంగిపోయేందుకు వచ్చిన ఉద్యమకారులను చిత్రహింసలు పెట్టి హత్యలు చేస్తుందని, 2026నాటికి నక్సలిజం లేకుండా చేస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించి ఇటువంటి బూటకపు ఎన్‌కౌంటర్లుకు పాల్పడుతుందని సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు ఆరోపించారు. గత మూడు రోజులుగా ఖమ్మం సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ కార్యాలయం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర కమిటీ అంతర్గత సమావేశాలు జరిగాయి. ఈ మేరకు బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, కేజీ రామచందర్, కెచ్చల రంగయ్య, కే. రమ, ఉప్పల ప్రభాకర్, పాయం చిన్న చంద్రన్న, నంది రామయ్య, గడ్డం సదానందం మాట్లాడారు. ప్రజాస్వామ్య, లౌకిక విధానంతో భావస్వేచ్ఛతో కూడిన రాజ్యాంగం భారతదేశంలో అమలులో ఉందని ఆ మేరకు ఉద్యమకారులు తమ విధానాలను తెలియజేస్తారని, లొంగిపోయేందుకు వచ్చిన వారిని కోర్టుకు రిమాండ్ చేయకుండా చిత్ర హింసలు పెట్టి హత్యలు చేస్తున్నారని ఆరోపించారు.

డిసెంబరు 26న కమ్యూనిస్టు పార్టీ వందేళ్ల సందర్భంగా డిసెంబరు 25న హైదరాబాద్ సుందరయ్య భవన్‌లో సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్ర కమిటీ సభ్యులు పిట్ల రామకృష్ణ, నాయిని రాజు, సీవై పుల్లయ్య, జీ రామయ్య, ఆవుల అశోక్ పాల్గొన్నారు.

ఖమ్మం రూరల్: దేశ ప్రజల సంపదను, వనరులను దోచుకుంటున్న బహుళజాతి కంపెనీలకు వ్యతిరేకంగా పోరాడే వారిని బూటకపు ఎన్‌కౌంటర్లలో కాల్చి చంపుతున్నారని నిర్మూలిస్తున్నారని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటురంగారావు విమర్శించారు. మండల పరిధిలోని ఎం. వెంకటాయపాలెం గ్రామంలో బుధవారం జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేజీ.రామచందర్, కే.రమా, ప్రభాకర్, చిన్న చంద్రన్న, నంది రామయ్య, సదానందం, రామకృష్ణ, అచ్చయ్య, రాజు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పోటు రంగారావు

సామినేని రామారావుది ముమ్మాటికీ రాజకీయ హత్యే

» నిందితులను అరెస్టు చేయాలంటూ 25న నిరసన దీక్ష » రాష్ట్ర వ్యాప్త ఉద్యమానికి అఖిలపక్షం తీర్మానం

ఖమ్మం అర్బన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల చింతకాని మండలం పాతర్లపాడు గ్రామంలో హత్యకు గురైన సీపీఐ రాష్ట్ర రైతు సంఘ నేత సామినేని రామారావుది ముమ్మాటికీ రాజకీయ హత్యేనని పలు పార్టీల నాయకులు అన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం సీపీఎం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో సీపీఎం, సీపీఐ, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్, న్యూడెమోక్రసీ, బీఆర్ఎస్, పార్టీల నేతలు వివిధ అనుబంధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. దోషులను ఇప్పటికైనా అరెస్టు చేయాలన్న డిమాండ్ చేస్తూ ఈనెల 25న నిరసన దీక్షలతోపాటు రాష్ట్ర వ్యాప్తఉద్యమం నిర్వహిస్తామని అఖిలపక్ష నేతలు స్పష్టం చేశారు..



అఖిలపక్షం రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న నాయకులు

నేతలు ఏమన్నారంటే..

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్ మాట్లాడుతూ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఒత్తిడి వల్లే పోలీసులు నిందితులను అరెస్టు చేయటంలేదని ఆరోపించారు. ఫలానా వారు నిందితులని మృతుడి భార్య ఫిర్యాదు చేసినా పోలీసులు ఆకోణంలో విచారించటంలేదన్నారు. కేసును కుట్రపూరిత కోణంలో విచారిస్తున్న పోలీసులు అసలు దోషులను గుర్తించటంలేదన్నారు. హత్యకు పాల్పడిన వారుఅధికార పార్టీకి చెందిన వారు కావటం వల్లే కేసును నీరుగార్చేయత్నం చేస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధు సూదన్ మాట్లాడుతూ కిరాయి హత్యల సంస్కృతిని ఆదిలోనే అడ్డుకోక పోతే ప్రమాదకరమని, రామారావు హత్యను రాజకీయ హత్యగా గుర్తించాలన్నారు. ఉపముఖ్యమంత్రి సతీమణి మల్లు నందిని షాడో ఎమ్మెల్యేగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే బీఆర్ఎస్ నేత సండ్ర వెంకట వీరయ్య మాట్లాడుతూ సామినేని రామారావుది ముమ్మాటికీ రాజకీయ హత్యేనని అన్నారు. అధికార పార్టీ కేసుల విచారణను పక్కదోవ పట్టించే విధంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్ రాజు మాట్లాడుతూ సామినేని రామారావు హత్య కేసును పోలీసులు న్యాయబద్ధంగా విచారించాలని డిమాండ్ చేశారు. డిప్యూటీ సీఎం సతీమణి మెప్పు కోసం కాకుండా నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలన్నారు. సీపీఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేష్ మాట్లాడుతూ రామారావు హత్య విచారణ పక్కదారి పడుతోందని ఆరోపించారు. కేసు విచారణలో పోలీసుల తీరు అనుమానించే విధంగా ఉందన్నారు. సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ జిల్లా కార్యదర్శి గోకినపల్లి వెంకటేశ్వర్లు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సామినేని రామారావు హత్యకేసులో పోలీసులు ఉద్దేశ్య పూర్వకంగానే జాప్యం చేస్తున్నారన్నారు. ఆరోపించారు. ఆధిపత్యం సాధించేందుకు హత్య చేసినట్లు స్పష్టంగా అర్థం అవుతోందన్నారు. సీపీఐ (ఎంఎల్) ఎన్డీ జిల్లా కార్యదర్శి కోలా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ హత్యలతో భయభ్రాంతులకు గురిచేసి కమ్యూనిస్టులను ఉద్యమాలనుంచి వెనక్కు నెట్టలేరన్నారు. జరిగింది రాజకీయ హత్య కాగా పోలీసులు దానిని పక్కదోవ పట్టించే విధంగా విచారణ జరుపుతున్నారనిఅన్నారు. ఈ సమావేశంలో సామినేని రామారావు కుమారుడు విజయ్, టీడీపీ జిల్లా నాయకుడు కేతినేని హరీష్, సీపీఎం నాయకులు మాచర్ల భారతి, బండి రమేష్, బండి రమేష్, కళ్యాణం వెంకటేశ్వరరావు, వై.విక్రమ్, తదితరులు పాల్గొన్నారు.

పత్తి రైతుల సమస్యలపై పోరాడుతాం

» ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

జూలూరుపాడు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పత్తి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పార్లమెంటులో ప్రస్తావించి కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించి రైతులకు న్యాయం జరిగే విధంగా కృషి చేస్తానని రాజ్యసభ సభ్యుడు (ఎంపీ) వద్దిరాజు రవిచంద్ర అన్నారు. బుధవారం ఆయన జూలూరుపాడులో ప్రైవేట్ వ్యాపారులు ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. రైతుల వద్ద నుంచి వ్యాపారులు కొనుగోలు చేసిన పత్తిని పరిశీలించారు. ఎంత ధరకు వ్యాపారులు పత్తిని కొనుగోలు చేస్తున్నారని రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తి రైతుల సమస్యలపై పార్లమెంటులో పోరాడి సీసీఐ కొనుగోళ్లలో నింబంధనలను సడలించాలని కేంద్ర ప్రభుత్వంపై బీఆర్ఎస్ ఎంపీల మందరం కలసి ఒత్తిడి తెస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు రావులపల్లి రాంప్రసాద్, జిల్లా నాయకుడు యల్లంకి సత్యనారాయణ, లకావత్ గిరిబాబు. చాపలమడుగు రాంమ్మూర్తి, యదళపల్లి వీరభద్రం, హనుమంతురావు, రామారావు, తిరపతి, శంకర్, హరిలాల్ తదితరులున్నారు.



సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎంపీ వద్దిరాజు

ఘనంగా ఉర్సే షరీఫ్ వేడుకలు

● అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు



ఇల్లెందులో సందల్ ఊరేగింపు

ఇల్లెందు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఇల్లెందులో ఉర్సే షరీఫ్ వేడుకలు బుధవారం రాత్రి ఘనంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలోని నెం.2 బస్తీలో హజరత్ ఖాసిం దలహా దర్గాలో ఛాదర్ సమర్పించిన పిదప సందల్ వేడుకలు జరిగాయి. అనంతరం చాదర్, సందల్‌ను ప్రత్యేక వాహనంపై సత్యనారాయణపురం చిల్లలోని నాగుల్‌మీరా దర్గా వరకు ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కేంద్రంతో మాట్లాడండి.. ఆంక్షల్లేకుండా పంటలు కొనుగోలు చేయించండి

» అంతేకాని రాష్ట్రప్రభుత్వంపై అబద్ధపు ప్రచారాలు చేయొద్దు

» బీజేపీ, బీఆర్ఎస్‌పై మంత్రి తుమ్మల గరం గరం

» రఘునాథపాలెంలో విలేకరుల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

ఖమ్మం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : 'దమ్ముంటే కేంద్రంతో మాట్లాడండి. ఆంక్షల్లేకుండా పంటలను కొనుగోలు చేయించి రైతులను ఆదుకోండి. అంతేకాని రాష్ట్రాన్ని అధోగతిపాలు చేసేలా అబద్ధపు ప్రచారాలు చేయొద్దు' అంటూ వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బీజేపీ, బీఆర్ఎస్ నేతలకు హితవు పలికారు. రఘునాథపాలెంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఆ పార్టీల తీరుపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. రేవంత్‌రెడ్డి పాలనకు రెండేళ్లు కూడా నిండకముందే రాష్ట్రాన్ని అథోగతిపాలు చేసేలా బీజేపీ, బీఆర్ఎస్ అసత్య ప్రచారాలు చేస్తున్నాయని, వాళ్ల ఇంట్లో నిప్పు చెలరేగిందని, అసత్య ప్రచారలతో అబద్ధపు విమర్శలతో రాష్ట్రానికి నిప్పంటిస్తారా? అంటూ ధ్వజమెత్తారు. గతంలో యూరియా కొరత విషయంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు తప్పుడు మాటలు మాట్లాడారని, ఇప్పుడు పత్తి కొనుగోళ్లపైనా అదే తీరున వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పత్తి కొనుగోలు బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదని, దేశంలో పండే పత్తి మొత్తాన్ని కొంటామని ప్రధాని మోదీ చెప్పారని గుర్తుచేశారు. గతంలో 11.75 క్వింటాళ్ల దిగుబడి ఉంటుందని అది కొంటామని చెప్పి ఇప్పుడు 7 క్వింటాళ్లు కొంటామని చెప్పారని, కపాస్ యాప్ విధానం ప్రవేశపెట్టి రైతులను ఇబ్బందులు పెడుతున్నారన్నారు. తుఫాన్లు అధికంగా రావడంతో రైతులు అనేక విధాలుగా నష్టపోయారని, అయినప్పటికి తేమ విషయంలో కొంతైనా ఉపశమనం ఇవ్వలేదని, 12శాతం నుంచి ఎక్కువకు పెంచాలని తాము అనేకసార్లు కోరామన్నారు. జిన్నింగ్ మిల్లులు కూడా ఎల్1, ఎల్2, ఎల్3 నిబంధనలతో కొన్నింటిలోనే కొనుగోలు చేస్తామని కొత్త నిబంధనలు పెట్టడంతో జిన్నింగ్ మిల్లులు, రైతులను ఇబ్బందులకు గురిచేశారని రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని జిన్నింగ్ మిల్లుల సమ్మెను పరిష్కరించిందని కనీసం వారి సమస్యలు అర్థం చేసుకోలేని పరిస్థితిలో కేంద్రం ఉందన్నారు. రుణమాఫీపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు చేసిన విమర్శపై ఆయన కాంగ్రెస్ హామీ ఏమిటో తెలుసుకోవాలని రూ.2లక్షలోపు రుణమాఫీ చేస్తామని చెప్పి ఒకేసారి రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదన్నారు. తుఫాన్‌కు నష్టపోయిన పంటలకు ఎకరానికి రూ.10వేల వంతున మంజూరుచేశామని, గత వరదలతో నష్టపోయిన రాష్ట్రానికి సహాయం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని అడిగితే ఏ సహాయం చేయలేదన్నారు. దేశంలో అత్యధికంగా వరి పండిస్తున్న, పామాయిల్ సాగవుతున్న రాష్ట్రం తెలంగాణ అని, దిగుమతి సుంకం తగ్గించడం వల్ల రైతులు గిటుబాటుధర కోల్పోతున్నారన్నారు. గత పదేళ్ల రాష్ట్రాన్ని అధోగతిపాలు చేసిన బీఆర్ఎస్ నాయకులు ఇప్పుడు బయలుదేరారని తమ వల్లే పత్తికొనుగోలు జరుగుతున్నాయని చెప్పుకుంటున్నారని, వారి చేష్టలు చూసి జనం నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయాల్సింది పోయి.. రాష్ట్ర ప్రభుత్వంపై అభాండాలు వేయడమేంటని మండిపడ్డారు. వారు చేసిన అవినీతివల్లే వారు ఇంట్లో కూర్చున్నారని, ఇంకా ప్రజలను మభ్యపెట్టాలంటే కుదరదని, వారి చరిత్ర తెలంగాణ ప్రజలకు తెలియనిదికాదన్నారు. దమ్ముంటే వారి కుటుంబసభ్యులు చేస్తున్న విమర్శలు సమాధానం చెప్పాలన్నారు. 'మీ ఇంటి కుంపట్లో నిప్పులు పడ్డాయని.. రాష్ట్రానికి నిప్పు పెట్టాలంటే అది భ్రమే అవుతుంది. బీఆర్ఎస్, బీజేపీలు ఎన్నికల్లో మిమ్మలను ఓడించారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని రైతులను అధోగతిపాలు చేయాలని.. ప్రస్తుతం వారి కోసం పనిచేస్తున్న ప్రభుత్వాన్ని దెబ్బతీసి అధికారంలోకి ఎక్కాలంటే అది కుదరదు' అని ఘాటుగా వ్యాఖ్యానించారు. జీఎస్టీగా పన్నులు కడుతున్నా అందుకు తగిన విధంగా రాష్ట్రానికి నిధులు ఇవ్వడంలేదన్నారు. దేశంలో అత్యధికంగా జీఎస్టీ చెల్లించే తెలంగాణకు తక్కువ నిధులు ఇస్తున్నారన్నారు. వరద నష్టం వస్తే ఇప్పటి వరకు తెలంగాణ రాష్ట్రానికి కేంద్ర బృందాన్ని పక్క రాష్ట్రానికి పంపి తెలంగాణకు పంపలేదని విమర్శించారు.

ఈసారైనా ఉత్తర ద్వార దర్శనం దక్కేనా?

(5వ పేజీ తరువాయి)

వినికిడి. ఈ నేపథ్యంలో భద్రాచలంలో కలెక్టర్ జితేష్‌వి పాటిల్ అధ్యక్షతన గురువారం సబ్‌కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో వైకుంఠ ఏకాదశి ముందస్తు ఏర్పాట్లపై జిల్లా అధికార యంత్రాంగంతో సమీక్ష నిర్వహించనున్నారు. ఈ మేరకు ఇప్పటికే ఇందుకు సంబంధించి సంబంధిత అధికారులకు సమాచారం అధికారికంగా వెళ్లింది.

చలి తీవ్రత నేపథ్యంలో..

ఈసారి చలి తీవ్రత నవంబరులోనే అధికంగా ఉంది. ఈ క్రమంలో డిసెంబరు 20 నుంచి జనవరి 9 వరకు వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాలు నిర్వహించనుండగా తెలుగు రాష్ట్రాలతో పాటు దేశం నలుమూలల నుంచి అధికసంఖ్యలో భక్తులు తరలివస్తుంటారు. భక్తుల సంఖ్యకు అనుగుణంగా తాత్కాలిక వసతి ప్రధాన సమస్యగా నిలుస్తోంది. ఈ సమస్యకు పరిష్కారం చూపాలని భక్తులు అధికారులను కోరుతున్నారు.

గతేడాది నుంచి ఉత్సవాల చెల్లింపులు మరిచారు

గతేడాది ఉత్సవాల చెల్లింపులు ప్రభుత్వం మరిచిందనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. గతేడాది గణేష్ నిమజ్జనానికి పని చేసిన గజఈతగాళ్లకు నేటి వరకు చెల్లింపులు లేవు. అలాగే పెట్రోలు బంకుల్లో కూడా రూ.లక్షల్లో చెల్లింపులు నిలిచిపోయాయి. ప్రత్యేక పారిశుధ్య సిబ్బందికి చెల్లించాల్సినవి సైతం ఇవ్వలేదని సమాచారం. ముక్కోటి శ్రీరామనవమికి వినియోగించిన బ్లీచింగ్, సున్నంలకు సైతం ఇంకా చెల్లింపులు జరగనట్టు ప్రచారం. పంచాయతీ రోజువారి పారిశుధ్య పనులకు కూడా ఆర్థికపరమైన సమస్యలు ఎదురవుతున్నట్టు తెలుస్తోంది.

ఏరు.. ఈ సారి లేదా?

కలెక్టర్ జితేష్‌వి పాటిల్ ప్రత్యేక చొరవతో గతేడాది గోదావరి నదీ తీరంలో ఏర్పాటు చేసిన ఏరు ది రివర్ ఫెస్టివల్ ఎంతో ఆకట్టుకుంది. అయితే ఈసారి ఏరు ఫెస్టివల్ లేదా అంటూ పలువురు పర్యాటక అభిమానులు ప్రశ్నిస్తున్నారు. గోదావరి నదీ తీరంలో ఈ ఏడాది జనవరి 9, 10 తేదీల్లో రెండు రోజుల పాటు ఏరు ది రివర్ ఫెస్టివల్ నిర్వహించగా సంప్రదాయ శాస్త్రీయ నృత్యాలు, ఆధ్యాత్మిక పాటలు భక్తులను, పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ విషయమై ఇప్పటి వరకు ఎటువంటి కదలిక లేకపోవడంతో సర్వత్రా చర్చ జరుగుతోంది.

ఇందిరమ్మ ఇళ్లకు సాంకేతిక లోపం

(5వ పేజీ తరువాయి)

ఈ ప్రక్రియలోనే అవాంతరాలు ఎదురౌతున్నాయి. ముగ్గుపోసి పనులు ప్రారంభించిన నాటి లాంగిట్యూడ్, లాటిట్యూడ్‌లు ప్రస్తుతం పూర్తయిన పునాది నిర్మాణాల సరిహద్దులతో సరిపోవడం లేదు. దీంతో నెలల తరబడి బిల్లులు నిలిచిపోయి లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. సమస్యను పరిష్కరించాలంటూ ఒకట్రెండు నెలల క్రితమే భద్రాద్రి కలెక్టరేట్ నుంచి హైదరాబాదు హౌజింగ్ ఎండీకు నివేదిక వెళ్లినట్లు తెలుస్తోంది.

ప్రారంభం కాని 352 గృహాలు

ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి వివిధ దశల్లో రూ.5లక్షలు ఇస్తున్నా.. మండల వ్యాప్తంగా నేటికీ 352 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభంకాలేదు. ఇల్లు కట్టుకునేందుకు ప్రాథమికంగా అవసరమైన డబ్బు వారివద్ద లేకపోవడం ప్రధాన కారణంగా కనిపిస్తోంది. దీంతోపాటు చనిపోయిన వారిపేరిట ఇళ్లు మంజూరవడం మరో కారణం. పూర్తి నిరుపేదలను గుర్తించి కాంట్రాక్టరు ద్వారా ఇళ్లను నిర్మించడం లేదా బ్యాంకు రుణాలను మంజూరు చేస్తేతప్ప వారు ఇళ్లు కట్టుకునే పరిస్థితి కనబడడం లేదు.

అప్పుచేసి ఇల్లు కడుతున్నాం..

డబ్ల్యూఎల్ రేగుబల్లికి చెందిన పడిదల దేవి నాలుగు నెలల క్రితం ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని ప్రారంభించింది. నిర్ణీత సమయంలో ఇల్లు కట్టకపోతే క్యాన్సిల్ అవుతుందనే భయంతో రూ.1లక్ష అప్పుతెచ్చి నిర్మాణం ప్రారంభించింది. ప్రారంభించిన నెలలోపులో పునాది నిర్మాణం పూర్తిచేసింది. పునాది బిల్లు పడితే, ఇంటి నిర్మాణం పూర్తిచేయొచ్చని ఆశపడింది. మూడు నెలలగా బిల్లుకోసం ఎదురు చూస్తోంది. అప్పుతేగా వడ్డీ పెరిగి పోతోందని, ఏఈ, కార్యదర్శులకు అనేకసార్లు మొరపెట్టుకున్నా ప్రయోజనం లేకుండా పోయిందని లబ్ధిదారులు దేవి ఆవేదన వ్యక్తం చేసింది.

ఏఈ ఏమంటున్నారంటే!

సమస్యను తమ శాఖ ఉన్నతాధికారుల ద్వారా మూడు నెలల క్రితమే కలెక్టర్‌కు తెలిపాం. సమస్య త్వరలోనే పరిష్కారానికి నోచుకుంటుందని భావిస్తున్నట్లు హౌజింగ్ ఏఈ నితిన్ తెలిపారు. కడు పేదరికం కారణంగా ఇళ్లు కట్టుకోలేని వారికి సెర్ప్ ద్వారా కట్టించాలనే ప్రతిపాదన ఉందన్నారు.

ఆకాశమే హద్దుగా మహిళలు ఎదగాలి

(5వ పేజీ తరువాయి)

రాష్ట్రంలోని స్వయం సహాయకసంఘాలకు చెందిన 65లక్షల మందితో పాటు ఇతర పేద మహిళలు 35లక్షల కలిపి కోటిమంది మహిళలకు కోటి చీరలు రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తోందన్నారు. ఈ చీరలను అందుకుంటున్న మహిళలు.. తమ పుట్టింటి చీర ఇస్తే ఎంత అభిమానంచూపుతారో అదే ఆప్యాయత అనురాగాలను రాష్ట్ర ప్రభుత్వంపై చూపి ఆశీర్వదించాలని కోరారు. ఈనెల 19నుంచి డిసెంబరు 9వరకు మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమం సాగుతుందని, హైదరాబాద్ తర్వాత రఘునాథపాలెంలోనే స్వయం సహాయక సంఘాల మహిళలకు చీరల పంపిణీ చేపట్టామన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని, అభివృద్ధి ప్రభుత్వమని, అందుకే ముఖ్యమంత్రి.. ఇచ్చిన హామీలన్నిటిని నెరవేరుస్తున్నారని గుర్తు చేశారు. ఆర్థికపరమైన నష్టాలు, కష్టాలున్నా ఈ ఆర్థిక వ్యవస్థను గత ప్రభుత్వం చిన్నాభిన్నం చేసినా ఈ ప్రభుత్వంపై తప్పుడు విమర్శలు చేస్తున్నారని, నిన్న కేసీఆర్ కూతురు గతంలో ఏంజరిగిందో చెప్పిందో గుర్తుంచుకోవాలన్నారు. ఈ ప్రభుత్వం పటిష్ఠంగా, పకడ్బందీగా సంక్షేమకార్యక్రమాలు అమలు చేస్తుందన్నారు. ముందు 65లక్షల మంది మహిళలకే చీరలు ఇద్దామని అనుకున్నామని, మహిళలకే అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలుచేయడం జరుగుతుందని, పొదుపుతో స్వశక్తితో రాణిస్తున్న మహిళలందరినీ ఇందిర మహిళ గ్రూపుల కింద మార్చామని, అందుకే పేదలందరికీ చీరలందేలా కోటి మందికి కోటి చీరలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇది భారతదేశంలో ఎక్కడా లేని విధంగా జరుగుతుందన్నారు. మహిళలు స్వయం సహాయక సంఘాల ద్వారా వ్యాపారంలో రాణించాలని, ప్రభుత్వం అమలుచేసే అభివృద్ధి, సంక్షేమకార్యక్రమాలను అందుకుని ఆర్థికంగా ముందడుగు వేయాలని కోరారు. ఆర్టీసీ బస్సుల నిర్వహణ, పెట్రోల్‌బంకులు సోలార్ ఉత్పత్తి స్టేషన్లు అన్ని మహిళలతోనే నడుస్తున్నాయని, మీపిల్లలతో పాటు మీరు అభివృద్ధి చెందితే సమాజం కూడా అభివృద్ధి చెందుతుందన్నారు. కుటుంబ అవసరాలను స్వయం సహాయక గ్రూపులు తీర్చుకుని మరింత బలోపేతం కావాలని కోరారు. మహిళ సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉందన్నారు. ఈసందర్భంగా స్వయం సహాయక సంఘాలకు మంత్రి తుమ్మల రూ.53.14కోట్లు చెక్కులను అందించారు. కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లడుతు 18 ఏళ్ల నిండిన మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్నామని, జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లోచదివే లక్షా27వేలమంది విద్యార్థులకు మహిళ సఘాల ద్వారా ఏకరూపదుస్తులు కుట్టించి రూ.కోటి22లక్షల ఆదాయం అందిస్తున్నామన్నారు. జిల్లాలో 5.8మెగావాట్ల సామర్థ్యంతో రెండోసోలార్ ప్లాంట్లను మహిళ సంఘాల ద్వారా ఏర్పాటుచేస్తున్నామన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా రూ.35కోట్లతోపాఠశాల అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరావు ప్రసంగిస్తూ ఇందిరమ్మ ప్రభుత్వంలో సీఎం రేవంత్‌రెడ్డి హామీలను నేరవేరుస్తూ మహిళ సంక్షేమానికికృషిచేస్తున్నారని తెలిపారు. మంత్రి తుమ్మల సహకారంతో జిల్లా అభివృద్ధి కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మినారాయణ, ఏఎంసీ మాజీచైర్మన్ మానుకొండ రాధాకిషోర్, ఏఎంసీ చైర్మన్ యరగర్ల హనుమంతరావు డీఆర్‌డీవో సన్యాసయ్య, డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, డీటీడబ్ల్యూవో రాంగోపాల్‌రెడ్డి, ఆర్అండ్‌బీఎస్ఈ యాకోబ్ తదితరులు పాల్గొన్నారు.

జైళ్లు.. పరివర్తనకు కేంద్రాలు కావాలి

(5వ పేజీ తరువాయి)

అగరబత్తి తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసిన సిబ్బందిని ఆమె ప్రత్యేకంగా అభినందించారు. ఇలాంటి పరిశ్రమను రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించనున్నట్లు డీజీ వెల్లడించారు. సబ్‌కలెక్టర్ మృణాల్‌శ్రేష్ఠ, జైళ్లశాఖ ఐజీ ఎన్.మురళీబాబు, వరంగల్ రేంజి డీఐజీ ఎం.సంపత్, జిల్లా ఉపజైళ్ల అధికారి శ్రీధర్, ఉపజైలు సూపరింటెండెంట్ ఎ.ఉపేందర్ పాల్గొన్నారు.

రేగళ్లపాడు పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

సత్తుపల్లిరూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి మండలం రేగళ్లపాడు గ్రామ పంచాయితీ కార్యదర్శిగా పనిచేస్తున్న సింహాద్రి శివమాధవరావును కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి బుధవారం రాత్రి సస్పెన్షన్ విధించారు. ఇందిరమ్మ ఇండ్ల బిల్లు క్లియరెన్స్ ఏర్పాటు చేసేందుకు పీ.సీత నుంచి రూ.3వేలు, జే.ఏడుకొండలు నుంచి రూ.10వేలు లంచంగా ఇవ్వాలని పంచాయతీ సెక్రటరీ సింహాద్రి శివమాధవరావు ఈ నెల 4న డిమాండ్ చేశాడు. సీత రూ.3వేలు ఇవ్వగా ఏడుకొండలు నిరాకరించడంతో ఇందిరమ్మ లబ్ధిదారులకు ఏమైనా సమస్యలు, ఫిర్యాదులు చేసేందుకు ప్రభుత్వం ఏర్పాటుచేసిన టోల్‌ఫ్రీ నంబర్ 18005995991కు ఫిర్యాదు చేశాడు. చట్టబద్ధమైన విధులను నిర్వర్తించడంలో తీవ్ర నిర్లక్ష్యం చూపినందున, అధికారిక ప్రయోజనం కోసం దురుద్దేశ్యంతో లంచం డిమాండ్ చేసిందన విచారణ అధికారి నివేదిక ఆధారంగా కలెక్టర్ సస్పెన్షన్ విధించారు.

హుండీ లెక్కింపు దృశ్యం



లెక్కించిన నగదును బ్యాంకు అధికారులకు అందజేస్తున్న దేవస్థానం ఈవో దామోదర్‌రావు, తదితరులు



భద్రాద్రి రామయ్య హుండీల లెక్కింపు

70 రోజులకు సమకూరిన రూ.1,61,02,694 ఆదాయం

భద్రాచలం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానానికి హుండీ ద్వారా రూ.1,61,02,694 ఆదాయం సమకూరింది. రామాలయ ప్రాంగణంలోని చిత్రకూట మండపంలో బుధవారం హుండీ లెక్కింపు నిర్వహించారు. ఈ క్రమంలో 70 రోజులకు గాను మొత్తం రూ.1,61,02,694 ఆదాయం వచ్చింది. ఇందులో బంగారం 141 గ్రాములు, వెండి 850 గ్రాములు, అమెరికా డాలర్లు 347, సింగపూర్ డాలర్లు 31, కెనడా డాలర్లు 30, నేపాల్ రూపాయలు 25, సౌత్‌కొరియా వాన్స్ 11 వేలు, మలేషియా రింగెట్స్ రెండు, సౌదీ అరేబియా రియాల్స్ 21, యుఏఈ దీరామ్స్ 10, ఆస్ట్రేలియా డాలర్లు 20, టర్కీ లిరాస్ 10, ఇంగ్లాండ్ పౌండ్స్ ఐదు, యూరోప్ యూరో 10, బూటాన్ నగల్ట్రం 50 వచ్చినట్లు దేవస్థానం అధికార వర్గాలు పేర్కొన్నాయి. ఈ హుండీ లెక్కింపును దేవస్థానం ఈవో కె.దామోదర్‌రావు పర్యవేక్షణలో నిర్వహించారు. అయితే హుండీ లెక్కింపును చివరిసారిగా సెప్టెంబరు 10న నిర్వహించగా.. మళ్లీ 70 రోజుల అనంతరం లెక్కింపు నిర్వహించినట్లు ఈవో తెలిపారు.

రైఫిల్‌షూట్‌లో ఎమ్మెల్యే జారేకు 20 పాయింట్స్..

భద్రాద్రి జిల్లాలో రైఫిల్‌షూట్ గేమ్స్ నిర్వహించడం అభినందనీయం

అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ



రైఫిల్‌షూట్ చేస్తున్న ఎమ్మెల్యే ఆదినారయణ

లక్ష్మీదేవిపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రైఫిల్‌షూట్ లక్ష్యసాధనలో మూడు రౌండ్లు రైఫిల్‌షూట్ చేసి అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారయణ 20 పాయింట్స్ సాధించారు. సరదాగా ఎమ్మెల్యే చేసిన రైఫిల్ షూట్ పోటీలకు హాజరైన క్రీడాకారుల్లో ఉత్సాహం నింపింది. భద్రాద్రికొత్తగూడెం జిల్లా, లక్ష్మీదేవిపల్లి మండలంలోని శ్రీరామచంద్ర ఆర్ట్స్‌అండ్ సైన్స్ కళాశాల ప్రాంగణంలో జరిగిన 69వ ఎస్‌జీఎఫ్ అండర్14, 17, 19ఏళ్ల బాల,బాలికలు రాష్ట్రస్థాయి ఇండోర్ రైఫిల్‌షూట్ గేమ్స్ మీట్‌కు ఎమ్మెల్యే జారే ఆదినారాయణ బుధవారం హాజరయ్యారు. క్రీడాపోటీలు జరుగుతున్న తీరును నిర్వాహకులను అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏకాగ్రతతో సాధన చేస్తే రైఫిల్‌షూట్‌లో విజయాలు సాధించవచ్చన్నారు. రాష్ట్రస్థాయిలో గెలుపొందిన విజేతలు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలని క్రీడాకారులకు సూచించారు. వ్యయ ప్రయాసలతో కూడిన రైఫిల్‌షూట్ గేమ్స్ ఎక్కువగా ప్రధాన నగరాల్లో నిర్వహిస్తారని అటువంటి గేమ్స్ ఏజెన్సీ ప్రాంతమైన భద్రాద్రికొత్తగూడెం జిల్లాలో నిర్వహించడం పట్ల ఆయన హర్షం వ్యక్తంచేసారు. ఈ పోటీల నిర్వహణకు ప్రత్యేక శ్రద్ధచూపిన భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్, క్రీడలకు హాజరైన కోచ్‌లు, నిర్వాహకులు, క్రీడాకారులను ఆయన అభినందించారు.

భవిష్యత్తు తరాలకు స్వచ్ఛమైన ప్రకృతిని అందిద్దాం

పాఠశాల విద్యాశాఖ అదనపు డైరెక్టర్ శ్రీనివాసాచారి

సత్తుపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి పర్యావరణంపై అవగాహన కలిగిఉండి భవిష్యత్తు తరాలకు కలుషితం కాని స్వచ్ఛమైన ప్రకృతిని అందిద్దామని డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కూల్ ఎడ్యూకేషన్ అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసాచారి అన్నారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కూల్ ఎడ్యూకేషన్, కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవెల్యూషన్, నాబార్డ్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో యంగ్ ఎర్త్ లీడర్స్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ గార్డెన్, కిచెన్ గార్డెన్, వాటర్ హార్వెస్టింగ్ పిట్, కంపోస్ట్ పిట్, జనరల్ ప్లాంటేషన్ ప్రారంభించారు. భూమి, నీరు, గాలి చివరికి మనం తినే ఆహారం కూడా కలుషితమై ప్రజల ప్రాణాలు తీసేస్తున్నాయని, తమ పుట్టిన రోజులతో పాటు ప్రత్యేకమైన రోజుల్లో ప్రతిఒక్క విద్యార్థి మొక్క నాటాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈవో నక్కా రాజేశ్వరరావు, ఏఎంఓ ప్రభాకరరెడ్డి, కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవెల్యూషన్ ఛైర్మన్ లక్ష్మారెడ్డి, యంగ్ ఎర్త్ లీడర్స్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ యానాల వెంకట్‌రెడ్డి, పుడమి సంపాదకులు రమేష్‌రావు, హెచ్‌ఎం నీరుడు నాగేశ్వరరావుతో పాటు ఉపాధ్యాయులు, నిర్వహకులు పాల్గొన్నారు.



మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న పీడీ శ్రీనివాసాచారి

క్రీడల్లో జిల్లా ఖ్యాతిని చాటాలి

ముగిసిన ఉమ్మడి జిల్లాస్థాయి జోనల్ క్రీడలు



ముగింపు సభలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో రాహుల్



కబడ్డీ పోటీల్లో తలపడుతున్న పాల్వంచ, దమ్మపేట జట్లు

పాల్వంచ రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయిలో ఏటూరి నాగారంలో జరిగే గిరిజన క్రీడా పోటీల్లో జిల్లా ఖ్యాతిని చాటాలని ఐటీడీఏ పీవో వి.రాహుల్ అన్నారు. బుధవారం ఉమ్మడి జిల్లాలోని జోనల్‌స్థాయి గిరిజన విద్యార్థి క్రీడా పోటీలు ముగిసాయి. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో గిరిజన ఆశ్ర మ పాఠశాల విద్యార్థులు క్రీడా రంగంలో ఎంతో ప్రతిభ కలిగి ఉన్నారన్నారు. ఈ జోనల్ క్రీడా పోటీల్లో అత్యంత ప్రతిభను చూపిన క్రీడాకారులను గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణ ఇప్పించనున్నామని చెప్పారు. ఈ క్రీడా పోటీల్లో ఏడు జోన్‌ల నుంచి 1300 మంది క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభను చూపారని తెలిపారు. గెలుపు ఓటములు సహజంగా తీసుకుని ఓటమిలో లోపాలను గుర్తించాలన్నారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని కోరారు. పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ క్రీడాకారులకు ఆశ్రమ గిరిజన పాఠశాలలు పేరు ప్రతిష్ఠతను చాటుతున్నాయని చెప్పారు. గ్రామీణ క్రీడలతో పాటు మిగితా క్రీడలపై కూడా పట్టు సాధించాలని ఆయన కోరారు. ఈ క్రీడల్లో గెలుపొందిన క్రీడాకారులకు మెడల్స్, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ అధికారి గోపాల్‌రావు, ఏటీడీవోలు చంద్రమోహన్, మంగతాయారు. పీడీలు వెంకటేశ్వర్లు, నగేష్, బాల సుబ్రహ్మణ్యం, హరికృష్ణ, సైదులు తదితరులు పాల్గొన్నారు.

గెలుపొందిన జట్లు ఇవే..

వాలీబాల్ పోటీల్లో ప్రథమ స్థానంలో పాల్వంచ జో న్, ద్వితీయ, తృతీయ స్థానాల్లో దుమ్ముగూడెం, దమ్మపేట జోన్‌లు గెలిచాయి. కబడ్డీలో ప్రథమస్థానంలో పా ల్వంచ జోన్, ద్వితీయ, తృతీయ స్థానాల్లో ఇల్లెందు, దమ్మపేట జోన్‌లు గెలుపొందాయి. కోకోలో ప్రథమ స్థానంలో దమ్మపేట జోన్, ద్వితీయ, తృతీయ స్థానాల్లో ఇల్లెందు, పాల్వంచ జోన్‌లు నిలిచాయి. క్యారమ్స్‌లో ప్రథమస్థానంలో వైరా జోన్, ద్వితీయ, తృతీయ స్థానాల్లో ఖమ్మం, ఇల్లెందు జోన్‌లు గెలుపొందాయి. చెస్‌లో ప్రథమస్థానంలో దమ్మపేట, ద్వితీయ తృతీయ స్థానాల్లో పా ల్వంచ, వైరా జోన్‌లు గెలుపొందాయి. టెన్నికాయిడ్‌లో ప్రథమస్థానంలో దుమ్ముగూడెం, ద్వితీయ, తృతీయ స్థానాల్లో ఇల్లెందు, దమ్మపేట జోన్‌లు గెలిచాయి.

మాదక ద్రవ్యాల నిర్మూలనకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి

భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్

కొత్తగూడెం కలెక్టరేట్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మాదక ద్రవ్యాల నియంత్రణకు అన్ని శాఖలు సమన్వయంతో కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదేశించారు. బుధవారం ఐడీఓసీ కార్యాలయం సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లాస్థాయి నార్కోటిక్ కంట్రోల్ కమిటీ జిల్లాలో నమోదవుతున్న కేసులు, గంజాయి సాగు నివారణ చర్యలు, మాదక ద్రవ్యాల వాడకం నియంత్రణ, శాఖల వారీగా చేపట్టాల్సిన కార్యక్రమాలు, ప్రజల్లో అవగాహన పెంపు వంటి అంశాలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డ్రగ్స్ వినియోగం వల్ల సమాజంపై పడుతున్న ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని, శాఖలు నిరంతర పర్యవేక్షణతో కఠిన చర్యలు చేపట్టాలని సూచించారు. యువతను మాదకద్రవ్యాల అలవాటు వైపు మళ్లకుండా ఆరోగ్యకరమైన దిశలో నడిపేందుకు శని,ఆదివారాల్లో క్రీడా కార్యక్రమాలు, జుంబా డాన్స్, ట్రెక్కింగ్ వంటి కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. పాల్వంచలోని శ్రీనివాస గుట్టలో ప్రత్యేక ట్రెక్కింగ్ కార్యక్రమం చేపట్టి, అక్కడ మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్లాన్ చేయాలని అధికారులను ఆదేశించారు. అటవీ ప్రాంతాల్లో గంజాయి సాగు కనిపించిన వెంటనే సమాచారాన్ని పోలీసులకు చేరవేసి తక్షణ చర్యలు నిర్ధారించాలని తెలిపారు. మాదక ద్రవ్యాలకు బానిసైన వారిని గుర్తించి, వారికి అవసరమైన చికిత్స, కౌన్సిలింగ్ అందించేందుకు డీ-అడిక్షన్ సెంటర్ల పనితీరును బలోపేతం చేయాలని సూచించారు. ఎవరైనా మాదకద్రవ్యాలు వినియోగించిన లేదా సాగు చేపట్టిన, సరఫరా చేసిన ఆ వివరాలను 1908 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా సమాచారం అందించాలని సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో ఇంటర్మీడియట్ అధికారి వెంకటేశ్వరరావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్, రవాణా శాఖ అధికారి వెంకటరమణ, పోలీస్, అటవీశాఖ అధికారులు, డ్రగ్ కంట్రోల్ శాఖ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

అటవీశాఖ ఉద్యోగి ఆత్మహత్య



మాలోత్ తులసీరామ్ (ఫైల్)

పినపాక, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలంలోని ఏడూళ్లబయ్యారం అటవీశాఖ రేంజ్ పరిధిలో విధులు నిర్వహించే ఓ ఉద్యోగి(37) పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేయడంతో చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. ఏడూళ్లబయ్యారం అటవీ రేంజ్, బందగిరి నగరం బీట్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న మాలోత్ తులసీ రామ్(37) నాలుగు రోజుల క్రితం పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు అతన్ని హుటాహుటిన కొత్తగూడెం ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం హైదరాబాద్ ఆసుపత్రికి తరలించి వైద్యం అందించారు. అక్కడ చికిత్స పొందుతూ హైదరాబాద్ ఆసుపత్రిలో బుధవారం మృతి చెందాడు. కానీ తులసీ రామ్ మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. బీట్ ఆఫీసర్ మృతి పట్ల ఏడూళ్లబయ్యారం రేంజర్ తేజశ్వి, సహ ఉద్యోగులు, సిబ్బంది సంతాపం తెలిపారు.

మూడు ఇసుక లారీలు సీజ్

నేలకొండపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): బుధవారం మూడు ఇసుక లారీలను నేలకొండపల్లి ఎస్‌ఐ పెంటరి సంతోష్ సీజ్ చేశారు. వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లోని నందిగామ నుంచి తెలంగాణకు ఇసుకను అక్రమంగా రవాణా అవుతుందన్న విశ్వసనీయ సమాచారం మేరకు బుధవారం తెల్లవారుఝామున ఎస్‌ఐ సంతోష్ తన సి బ్బందితో తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో చెర్వుమాధారం క్రాస్‌రోడ్డు వద్ద ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుకను రవాణా చేస్తున్న మూడు లారీలను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఇసుకను ఖమ్మం నగరానికి రవాణా చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమతి పత్రాలు లేకుండా ఇసుక తరలిస్తున్న..

బూర్గంపాడు, నవంబర్ 19 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న లారీని బుధవారం బూర్గంపాడు పోలీసులు పట్టుకున్నారు. మండల పరిధిలోని జింకలగూడెం వద్ద ఎస్‌ఐ ప్రసాద్ వాహన తనీఖీలు చేపట్టారు. తనీఖీల్లో భాగంగా అనుమతి పత్రాలు లేకుండా ఇసుక తరలిస్తున్న లారీని గుర్తించి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బాధ్యులైన డ్రైవర్, యాజమానిపై కేసు నమోదు చేసిన్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

జిల్లా వ్యాప్తంగా వాహన తనిఖీలు

ఖమ్మంక్రైం నవంబరు19 (ఆంధ్రజ్యోతి): రాత్రివేళలో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను అరికట్టే దిశగా మరింత పటిష్ఠ భద్రతా చర్యలు చేపట్టాలని ఖమ్మం పోలీసు కమిషనర్ సునీల్‌దత్ ఆదేశాల మేరకు మంగళవారం రాత్రి పోలీసుల ఎక్కడికక్కడ డ్రెంకెన్ డ్రైవ్, వాహన తనిఖీలు చేశారు. అనుమానాస్పద వ్యక్తుల ఫింగర్‌ప్రింట్లు, మొబైల్ చెక్ ద్వారా వేలిముద్రలు సేకరించారు. మద్యం సేవించి పట్టుబడిన వాహనదారులను న్యాయస్థానంలో ప్రవేశపెట్టి జైలుశిక్ష, జరిమనాలు విధించేలా పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నారు. జాతీయ రహదారులపై నియంత్రణ లేని నిర్లక్ష్యమైన రాష్ డ్రైవింగ్, హెల్మెట్ లేకపోవడం, మద్యం మత్తులో డ్రైవింగ్, త్రిబుల్ డ్రైవింగ్ చేయడం వలన ద్విచక్ర వాహనదారులు ఎక్కువ సంఖ్యలో ప్రమాదాలకు గురై మరణిస్తున్నారని నివేదికలు చెబుతున్న నేపథ్యంలో పోలీసుస్టేషన్ల పరిధిలో ప్రతిరోజు డ్రెంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టి చట్ట ప్రకారంగా చర్యలు తీసుకోవాలని తద్వారా ప్రమాదాల సంఖ్య తగ్గించవచ్చని పోలీసు అధికారులకు సీపీ ఆదేశించారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

బూర్గంపాడు, నవంబర్ 19 (ఆంధ్రజ్యోతి): వివాహిత అదృశ్యంపై బుధవారం బూర్గంపాడు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... బూర్గంపాడు మండల పరిధిలోని ఇరవెండి గ్రామానికి చెందిన కరివి మమత(23) తన ఇద్దరి పిల్లలతో కలిసి ఈ నెల 15వ తేదీన ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. వారి కోసం బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో బుధవారం ఆమె తల్లి పిచ్చమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ప్రసాద్ తెలిపారు.

అసంపూర్తిగా బ్రిడ్జి పనులు

వాగులపై రవాణాకు తిప్పలు తప్పడం లేదు

ధాన్యం ఎగుమతికి రహదారి ఇబ్బందులు

తాత్కాలిక రోడ్డు ఏర్పాటు చేయాలని రైతుల ఆవేదన



వాగులో ట్రాక్టర్ సహాయంతో లాగుతున్న ట్రాలీఆటో

ఆళ్లపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) వర్షాలు కురవకపోయినా, వాగులు పొంగకపోయినా, ఏజెన్సీలో వాహనదారులకు మాత్రం వాగులు దాటే క్రమంలో తిప్పలు తప్పడం లేదు. పొట్ట చేతపట్టుకుని బతుకుదెరువు కోసం బుధవారం కొత్తగూడెం నుండి ఆళ్లపల్లి మండలం మర్కోడు గ్రామానికి వచ్చిన ఓ వ్యాపారస్తుడికి జల్లేరు వాగు దాడే క్రమంలో ట్రాలీఆటో దిగబడి చుక్కలు కనిపించాయి. ట్రాలీఆటో ద్వారా ఇంట్లోకి అసరమైన ఫర్నిచర్‌ను అమ్ముకునేందుకు, మర్కోడుతో పాటు చుట్టు పక్క పల్లెలో తిరుగుతుంటాడు. ఈ క్రమంలో కర్నెగూడెం, చంద్రాపురం వెళ్లి, తిరిగివస్తూ జల్లేరు వాగుదాటే క్రమంలో ట్రాలీఆటో వాగులో దిగబడింది. అటుగా వెళ్లే గ్రామస్తులు, యువత ఆ ట్రాలీఆలోను తీసేందుకు నానా ప్రయత్నాలు చేసినపట్టికీ ఫలించలేదు. చివరకు ఓ ట్రాక్టర్ సహాయంతో బయటకులాగారు. ధాన్యం చేతికి వస్తున్న సమయం, పంటను మర్కోడుకు తరలించాలంటే, ఈ వాగులో ధాన్యం ట్రాక్టర్లు దిగబడి ఇబ్బందులు పడుతున్నామని రైతులు వాపోయారు. ఇప్పటికైనా అధికారులు, స్థానిక ఎమ్మెల్యే దృష్టిసారించి మర్కోడు- కర్నెగూడెం మధ్య జల్లేరు వాగుపై తాత్కాలికంగా మట్టిరోడ్డు ఏర్పాటు చేయాలని చంద్రాపురం, కర్నెగూడెం రైతులు కోరుతున్నారు. అసంపూర్తిగా ఉన్న బ్రిడ్జి నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

తూకంలో మోసం : నలుగురి అరెస్టు



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఎలక్ట్రానిక్ కాటాలు

తల్లాడ, నవంబరు19 (ఆంధ్రజ్యోతి) : తల్లాడ పరిసర మండలాల్లో పత్తి కొనుగోలు చేస్తూ ఎలక్ట్రానిక్ కాటాల్లో రిమోట్‌తో కంట్రోల్ చేస్తూ పత్తి తూకం తక్కువగా చూపిస్తూ రైతులను మోసం చేస్తున్న నలుగురు వ్యక్తులపై తల్లాడ పోలీసులుకేసు నమోదు చేశారు. వారివద్ద నుంచి నాలుగు టాటా ఏసీ వాహనాలతో పాటు నాలుగు ఎలక్ట్రానిక్ కాటాలు, రిమోట్‌లను ఎస్‌ఐ వెంకటకృష్ణ స్వాధీనం చేసుకున్నారు. బుధవారం తల్లాడలో ఎస్‌ఐ ఆధ్వర్యంలో పత్తిలోడుతో ఉన్న టాటా ఏసీ వాహనాలను తనిఖీ చేశారు వాహనాల్లో ఉన్న ఎలక్ట్రానిక్ కాటాలను పరిశీలించారు. కాటాతో పాట తూకం తక్కువగా చూపించేందుకు వినియోగించే రిమోట్‌లను గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నారు. మోసానికి పాల్పడుతున్న మండలంలోని బాలపేట గ్రామానికి చెందిన ఎస్.సైదారావు టి.కృష్ణయ్య, పి.లాలయ్య, తల్లాడకు చెందిన వి.శ్రీనులను అరెస్టు చేశారు. దీంతోపాటు ప్రభుత్వ అనుమతులు లేకుండా పత్తి కొనుగోలు చేస్తున్న 60 మంది వ్యాపారులపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్టు తెలిపారు.

పడమట నర్సాపురంలో చోరీ

పట్టుకోబోయిన వృద్ధుడిపై దాడిచేసి దొంగ పరారీ



వివరాలను తెలుసుకుంటున్న పోలీసులు

జూలూరుపాడు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పడమట నర్సాపురంలో రెండు ఇళ్లలో చోరీకి పాల్పడి ట్రాక్టర్‌కు సంబంధించిన సామగ్రిని దొంగలు ఎత్తుకుని వెళ్లిన సంఘటన బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాల్లోకెళితే ద్విచక్ర వాహనంపై ముగ్గురు వ్యక్తులు కలసి వచ్చారు. గ్రామంలోని లేళ్ల అనిల్‌రెడ్డి ఇంటి ఆవరణలోకి చొరబడి ట్రాక్టర్‌లో ఉన్న రూ.8వేల విలువ చేసే సామగ్రిని అపహరించారు. ఆ తర్వాత ఆ ఇంటి సమీపంలో ఉన్న మరో వృద్ధుడు తెల్లబోయిన వెంకటేశ్వర్లు ఇంట్లోకి చొరబడ్డారు. దీంతో వారు చోరీకి ప్రయత్నించడాన్ని గమనించిన వెంకటేశ్వర్లు వారిని పట్టుకునేందుకు వెంబడించాడు. ఈ క్రమంలో ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై పారిపోయారు. మరో వ్యక్తిని పట్టుకునేందుకు ప్రయత్నించగా వెంకటేశ్వర్లును కిందపడేసి కొట్టి పరారయ్యాడు.. చోరీ చేసిన సామగ్రిని, పిల్లులను వేటాడేందుకు ఉపయోగించే బరిసలను సదరు దొంగ అక్కడే వదిలిపెట్టి చేలల్లో పారిపోయాడు.. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వృద్ధుడు వెంకటేశ్వర్లు నుంచి వివరాలను నమోదు చేసుకున్నారు. దొంగలు విడిచిపెట్టి వెళ్లిన సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.

‘పొగ మంచు’ ప్రయాణాల్లో అప్రమత్తంగా ఉండాలి

భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజు



ఎస్పీ రోహిత్ రాజు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, నవంబరు19(ఆంధ్రజ్యోతి): పొగ మంచు పడుతున్న సమయంలో ప్రయాణాల్లో వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని భద్రాద్రి ఎస్పీ రోహిత్ రాజు బుధవారం సూచించారు. ఈ వాతావరణంలో ప్రయాణాలు చేసే సమయాల్లో వాహనదారులు పలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. శీతాకాలంలో దట్టమైన పొగమంచు కారణంగా రహదారులపై స్పష్టత బాగా తగ్గుతుందని, వాహనదారులు తమ భద్రతను దృష్టిలో ఉంచుకొని డ్రైవింగ్ చేయాలన్నారు. తెల్లవారుజామున దట్టమైన పొగ మంచు కురిసే సమయంలో ప్రయాణాలు చేయడం శ్రేయస్కరం కాదని, ఆ ప్రయాణాలు వాయిదా వేసుకోవడం మంచిదన్నారు. వాహనాలను నిదానంగా నడపాలని, వేగంగా వెళ్లడం అత్యంత ప్రమాదకరమని పేర్కొన్నారు. వాహనానికి ఫాగ్‌లైట్లు, పార్కింగ్ లైట్లతో పాటు తక్కువ బీమ్ హెడ్‌లైట్లను మాత్రమే ఉపయోగించాలన్నారు. హై బీమ్ లైట్లు పొగమంచులో మరింత ప్రతిభింబించి ముందు వచ్చే వాహనాల స్పష్టతను తగ్గిస్తాయని తెలిపారు. కారులో హీటర్‌ను ఆన్ చేసుకొని, ఎల్లప్పుడూ అద్దాలు శుభ్రంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముందు వెళుతున్న వాహనానికి కనీస దూరాన్ని పాటిస్తూ, ఆ వాహన సిగ్నల్స్‌ను గమనిస్తూ ఉండాలన్నారు. పొంగమంచు అధికంగా కురిసే సమయంలో ఓవర్ టెక్ చేయడం మంచిది కాదని పేర్కొన్నారు. అత్యవసరంగా రోడ్డు పక్కన ఆగాల్సి వస్తే, రోడ్డుకు దూరంగా ఆపి, హజర్డ్ లైట్లను వేసి ఉంచాలని వాహనదారులకు సూచించారు.

పేదల ఆరోగ్యానికి అండగా ఉంటాం..

రూ.40లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి



ఖమ్మం అర్బన్ నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : వైద్య చికిత్సలు పొందిన పేదలను ఆదుకునేందుకు రూ.40లక్షల విలువైన సీఎం సహాయనిధి చెక్కులను ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డి బుధవారం ఖమ్మంలోని తన క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు. ఖమ్మం, కొత్తగూడెంజిల్లాల పరిధిలో ఇటీవల పలు ప్రైవేటు, కార్పొరేటు వైద్యశాలల్లో అత్యవసర చికిత్సలు చేయించుకున్న పేదరోగులు తమను ఆర్థికంగా ఆదుకోవాలని దరఖాస్తు చేసుకోగా వారికి రూ.40లక్షల విలువైన సీఎం రిలీఫ్ ఫండ్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. అత్యవసర చికిత్సల కోసం ఎప్పటికే పలువురికి ఎల్‌ఓసీలు మంజూరు చేసినట్లు తెలిపారు. సీఎం సహాయనిధి నుంచి వారికి లబ్ది కలిగేలా చూస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్లు మానుకొండ రాధాకిషోర్, మద్ది మల్లారెడ్డి, కాంగ్రెస్ నాయకుడు కొప్పుల చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురికి తీవ్ర గాయాలు

దుమ్ముగూడెం/ అశ్వారావుపేట రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. తూరుబాక వంతెన వద్ద చర్ల వైపు నుంచి వస్తున్న కారు ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టింది. ఆటోలో ప్రయాణిస్తున్న గర్భిణీతో పాటు డ్రైవరుకు తీవ్రగాయాల పాలైన ట్లు తెలుస్తోంది. క్షతగాత్రులను భద్రాచలం ఆసుపత్రికి తరలించారు. అలాగే నరసాపురం చిన అరుణాచలం ఆలయంలో భోజనం చేసి పర్ణశాల వెళ్తున్న యాత్రికుల బస్సును అధిగమించేక్రమంలో లారీ వెనుక నుంచి ఢీకొట్టింది. యాత్రికులు క్షేమంగా బైటపడ్డారు.

అశ్వారావుపేటలో...

అశ్వారావుపేటలో బుధవారం ఉదయం జరిగిన రోడ్డు ప్ర మాదంలో ఇద్దరు యువకులు గాయపడ్డారు. సత్తుపల్లి మండ లం గంగారంకు చెందిన జయకృష్ణ, సాయిలు ద్విచక్ర వాహనంపై ఆంధ్రాలోని తాడేపల్లిగూడెంకు వెళుతున్నారు. ఖమ్మం రోడ్‌లో విద్యుత్ సబ్‌స్టేషన్‌లోకి వెళుతున్న వాహనం, యువకుల ద్విచక్రవాహనం ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో యువకులిద్దరికి పలుచోట్ల గాయాల య్యాయి. క్షతగాత్రులను అశ్వారావుపేటలోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.



గాయపడిన యువకులు

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సభలను విజయవంతం చేయండి

ఖమ్మంరూరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని జీవీఆర్ ఫంక్షన్ హాల్లో గురువారం జరగనున్న ఎస్‌ఎఫ్‌ఐ 47వ జిల్లా మహాసభను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు పోనుకుల సుధాకర్ పిలుపునిచ్చారు. మున్సిపాలిటీ పరిధిలోని వరంగల్ క్రాస్ రోడ్డులోని పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ మహాసభకు జిల్లా నలుమూలల నుంచి 200 మంది డెలిగేట్స్ హాజరవుతారన్నారు. డెలిగేట్స్ కు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. భవిష్యత్తులో విద్యారంగా సమస్యల పరిష్కారం కోసం వ్యూహరచన చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వరుణ్ కుమార్, కొమ్ము శ్రీనివాస్, నందిగామ కృష్ణ, వీరబాబు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పులను పెంచండి

» అదనపు కలెక్టర్ శ్రీజ



రికార్డులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ

నేలకొండపల్లి, నంబరు19(ఆంధ్రజ్యోతి): సీహెచ్‌సీలో ప్రసవాల సంఖ్య చాలా తక్కువ గా ఉందని, ప్రసవాలను పెంచాలని అదనపు కలెక్టర్ శ్రీజ చెప్పారు. బుధవారం నేలకొండపల్లి సీహెచ్‌సీని అదనపు కలెక్టర్ సందర్శించారు. వైద్యశాలలోని గదులు, వార్డులను కలియతిరిగారు. వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. వైద్యశాలలో వైద్యులెదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం శ్రీజ మాట్లాడుతూ సాధ్యమైంత త్వరలో నేలకొండపల్లిలోని పీహెచ్‌సీని చెర్వుమాధారం తరలించనున్నట్లు తెలిపారు. రోగులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూసుకోవాలన్నారు. సీహెచ్‌సీలో కలిసి ఉన్న పీహెచ్‌సీని చెర్వుమాధారం తరలించలించటానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. చెర్వుమాధారంలో నిర్మాణంలో ఉన్న పీహెచ్‌సీని పరిశీలించారు. డీసీహెచ్ఎస్ డాక్టర్ రాజశేఖర్‌గౌడ్, సీహెచ్‌సీ వైద్యాధికారి మంగళ, డాక్టర్ రాజేష్, పీఆర్ డీఈ వంశీ, ఏఈఈ ప్రసాద్, టీఎస్ఎంఐడీసీ డీఈ వెంకటకృష్ణ, ఎంపీడీవో ఎర్రయ్య, ఎంపీవో శివ తదితరులు ఉన్నారు.

నగరంలో రేపు విశ్వకవి అందెశ్రీ సంస్మరణ సభ



పోస్టర్‌ను ప్రదర్శిస్తున్న న్యాయవాదులు

ఖమ్మం లీగల్ నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా కోర్టు ప్రాంగణంలో శుక్రవారం అందెశ్రీ సంస్మరణ సభ పోస్టర్‌ను బుధవారం న్యాయవాదులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లా న్యాయవాదుల జేఏసీ చైర్మన్ బిక్షాల తిరుమలరావు మాట్లాడుతూ ఈ నెల 21న ఖమ్మం లోని భక్తరామదాసు కళాక్షేత్రంలో అందెశ్రీ సంస్మరణ సభ జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు జహీర్‌అలీ, పారుపల్లి అమర్‌చంద్, మద్రి ప్రకాష్, ఎస్.కె.లతీఫ్, నేరళ్ళ శ్రీనివాస్, విప్లవ కుమార్, శివకుమార్, నవీన్‌చైతన్య, పమ్మిరవి, పాగి వెంకన్న, ఖమ్మం గర్జన రాము, విజయ్ దేవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిధుల స్వాహా..?

» వేయని రోడ్లకు వేసినట్లు ఎంబీ రికార్డు
» రూ. 4.60 లక్షల ప్రభుత్వ సొమ్మును కాజేసిన వైనం

ఖమ్మం రూరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామాలను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో రూ.వందల కోట్ల నిధులు మంజూరు చేస్తుంది. అభివృద్ధి మాటున అధికారులు, గుత్తేదారులు నీకు సగం, నాకు సగం అన్నట్లు పంచుకుతింటున్నారు. పనులు చేయకుండానే చేసినట్లు..గ్రామాల్లో సీసీ రోడ్లు వేయకుండానే వేసినట్లు ఎంబీ రికార్డులు చేసి రూ.లక్షల్లో బిల్లులు స్వాహా చేస్తు ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు పొడుస్తున్నారు. ఖమ్మం జిల్లా, ఖమ్మం రూరల్ మండలంలోని ఎం వెంకటాయపాలెం గ్రామంలో సీసీ రోడ్లు వేయకుండానే వేసినట్లు పంచాయతీరాజ్ అధికారులు ఎంబీ రికార్డు చేసి నిధులు స్వాహా చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

26 రోడ్లకు రూ.కోటి నిధులు మంజూరు

మండల పరిధిలోని ఎం వెంకటాయపాలెం గ్రామంలో 2024-2025 కు సంబంధించి మహత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మొత్తం సుమారు 26 సీసీ రోడ్లు మంజూరయ్యాయి. వాటికి సంబంధించి ప్రభుత్వం నుంచి సుమారు రూ.కోటికి పైగా నిధులు మంజూరయ్యాయి. నిబంధనల ప్రకారం మంజూరు అయిన రోడ్లను ఈ ఏడాది మార్చి వరకు పూర్తి చేయాల్సి ఉంటుంది. ముందుగా పంచాయతీ రాజ్ శాఖ అధికారులు గ్రామంలో ఎక్కడెక్కడ రోడ్లు వేయాల్సి ఉందో అట్టి రోడ్లకు నిధులు మంజూరు చేయడం జరుగుతుంది. వాటిని గుత్తేదారుల ద్వారా రోడ్డు నాణ్యత ప్రమాణాలు వంటి వాటిని పీఆర్ అధికారులు దగ్గర ఉండి చూసుకోవాల్సి ఉంటుంది. రోడ్డు పూర్తిగా అయిపోయిన తరువాత దానిని ఆన్‌లైన్ చేసిన తరువాతనే ఎంబీ రికార్డు చేసి బిల్లులు మంజూరు చేయాల్సి ఉంటుంది. గ్రామంలో మొత్తం 26 రోడ్లు మంజురయ్యాయి. ఈ 26 సీసీ రోడ్లలో 20 రోడ్లు పూర్తి చేసినట్లు తెలుస్తుంది. కాగా మంజురు అయిన రోడ్లలో సుమారు 6 రోడ్లకు సంబంధించి సీసీ రోడ్లు వేయకుండానే రోడ్డు వేసినట్లు సృష్టించారని సమాచారం. అసలు వేయని రోడ్లకు పంచాయతీ రాజ్ శాఖ అధికారులు వేసిన రోడ్లకు సంబంధించిన ఫొటోలను పెట్టి ఎంబీ రికార్డు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. అనంతరం అట్టి ఎంబీ రికా ర్డు ద్వారా నిధులు మంజురు చేయించి చెక్కుల ద్వారా నిధులు స్వాహా చేసినట్లు బలమైన ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందుకు అధికారులకు, గుత్తేదారులకు సగం సగం చొప్పున పంచుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రధానంగా గ్రామంలోని పాపిట్ల గోపయ్య ఇంటి వద్ద నుంచి దొండేటి సత్యనారాయణ ఇంటి వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.4.60 లక్షల నిధులు మంజురయ్యాయి. అయితే ఈ రోడ్డుకు సంబంధించి ఎలాంటి పని ప్రారంభించలేదు. కనీసం తట్ట మట్టి కూడా ఎత్తలేదన్న ఆరోపణలు ఉన్నాయి. అయితే ఈ రోడ్డు విషయంలో రోడ్డు వేయకుండానే వేసినట్లు పంచాయతీరాజ్ అధికారులు, గుత్తేదారులు కలిసి వేరే ఫొటోలు పెట్టి ఎంబీ రికార్డు చేసి అట్టి నిధులు స్వాహాచేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

చెక్కు ఇవ్వకుండా నిరాకరించిన కార్యదర్శి....?

గ్రామంలో 26 సీసీ రోడ్లకు సంబంధించి పనులు పూర్తి అయినట్లు వాటికి మంజురు అయిన నిధులకు సంబంధించిన చెక్కులు గ్రామ పంచాయతీ కార్యదర్శికి అందాయి. అయితే అట్టి పనులను పరిశీలించిన పంచాయతీ కార్యదర్శి పాపిట్ల గోపయ్య ఇంటి నుంచి దొండేటి సత్యనారాయణ ఇంటి వరకు సీసీ రోడ్డు వేయలేదని మంజురు అయిన రూ.4.60 లక్షల చెక్కును గుత్తేదారులకు ఇవ్వకుండా నిలిపివేసినట్లు సమాచారం. సీసీ రోడ్డు వేయకుండా ఎంబీ రికార్డు ఎలా చేస్తారు, బిల్లులు ఎలా మంజురు చేస్తారని సదరు పంచాయతీ కార్యదర్శి గుత్తేదారుపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు విశ్వసనీయ సమాచారం. సుమారు 3 నెలల తరువాత అట్టి చెక్కును గుత్తేదారికి ఇచ్చినట్లు తెలిసింది.



పాపిట్ల గోపయ్య ఇంటి నుంచి దొండేటి సత్యమయ్య ఇంటివరకు సీసీ వేయని మట్టి రోడ్డు

కొద్దిరోజులు చెక్కు నిలిపివేశాను..

● పంచాయతీ కార్యదర్శి శ్రీలక్ష్మి

గ్రామంలో మంజురైన సీసీ రోడ్లకు సంబంధించి పూర్తిగా అయిన రోడ్లకు చెక్కులు పంపిణీ చేశా. కాని పాపిట్ల గోపయ్య ఇంటి నుంచి దొండేటి సత్యనారాయణ ఇంటి వరకు సీసీ రోడ్డు నిర్మాణం జరగలేదని రూ.4.60 లక్షల చెక్కును గుత్తేదారికి ఇవ్వకుండా నిలిపివేశాను. కొద్ది రోజుల తరువాత పంచాయతీ అధికారులు వచ్చి చెప్పడంతో పాపిట్ల గోపయ్య ఇంటి నుంచి కిందకు వేశాము పైకి మిగిలి ఉంది, దానిని త్వరలో చేయడం జరుగుతుందని చెక్కు ఇచ్చేయమన్నారు. దీంతో చెక్కు ఇవ్వడం జరిగింది.

రోడ్డు వేయకుండా వేసినట్లు బిల్లులు చేయడం కుదరదు ● పీఆర్ ఏఈ శ్రీనివాస్

సీసీ రోడ్లు వేయకుండా వేసినట్లు ఎంబీలు, బిల్లులు చేయడం కుదరదు. అయితే పాపిట్ల గొపయ్య ఇంటి నుంచి దొండేటి సత్యనారాయణ ఇంటి వరకు మంజురైన రోడ్డులో గోపయ్య ఇంటి నుంచి కింది భాగం సీసీ వేయడం జరిగింది. సత్యనారాయన ఇంటి వైపు కొంత మిగిలింది. దానిని త్వరలోనే పూర్తి చేస్తామన్నారు.

రాష్ట్రస్థాయి టీటీ పోటీలకు ఎస్‌బీఐటీ విద్యార్థి

ఖమ్మం స్పోర్ట్స్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నీస్ పోటీలకు తమ కళాశాలలో ఎంబీఏ మొదటి సంవత్సరం చదువుతున్న రెడ్డి సాయిశివ ఎంపికయ్యాడని కళాశాల కరస్పాండెంట్ గుండాల కృష్ణ తెలిపారు. సాయిశివ ఇటీవల నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి పోటీలలో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యాడని తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర పోటీలకు ఎంపికైన విద్యార్థిని ఆయన అభినందించారు.



శివసాయిని అభినందిస్తున్న కరస్పాండెంట్ గుండాల కృష్ణ

పుస్తక పఠన నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

» జిల్లా విద్యాశాఖ అధికారి చైతన్య జెనీ



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖ అధికారి చైతన్య జైనీ

ఖమ్మంఖానాపురంహవేలి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పుస్తక పఠన నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని, గ్రంథాలయాలలో విస్తృతమైన పరిజ్ఞానం కలిగే పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని జిల్లా విద్యాశాఖ అధికారి చైతన్య జైనీ అన్నారు. గ్రంథాలయ సేవలు వినియోగించుకోవాలని బుధవారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల ఆరవ రోజు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రంథాలయాలు విజ్ఞాన సర్వసాలని పుస్తకాలు వార్త పత్రికలు చదివి జ్ఞానం పెంచుకోవాలని అన్నారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఖమ్మం నగరం కి చెందిన పలు ప్రభుత్వ, ప్రవేట్ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ గ్రంథాలయ వారోత్సవాలలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కరుణ కుమారి, గ్రంథాలయ ఉద్యోగుల సంఘం నాయకులు, గ్రంథాలయ సంస్థ ఉద్యోగులు పాల్గొన్నారు.

బూటకపు ఎన్‌కౌంటర్లు నిలిపేయాలి

» సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు



మాట్లాడుతున్న హేమంతరావు

ఖమ్మం కార్పొరేషన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): దశాబ్దాల పాటు పేద ప్రజల కోసం పనిచేసిన వారిని మావోయిస్టు ఏరివేత పేరు తో పట్టుకొచ్చి చంపుతున్నారని ఇటువంటి బూటకపు ఎన్‌కౌంటర్లు వెంటనే నిలిపేయాలని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు డిమాండ్ చేశారు. బుధవా రం గిరిప్రసాద్ భవన్‌లో ఎస్‌కే జానిమియా అధ్యక్షతన నిర్వహించిన పార్టీ సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నారని ప్రభుత్వం భావిస్తే వారిని అదుపులోకి తీసుకొని కోర్టుకు అప్పగించాలని, ఇటువంటి ఎన్‌కౌంటర్లు చేయటం సమాజంలో అశాంతికి దారితీస్తాయన్నారు.

కమ్యూనిస్టు పార్టీ పురోభివృద్దికి, భవిష్యత్ ప్రజాఉద్యమాలకు ఖమ్మంలో నిర్వహించే శతాబ్ది ఉత్సవాలు దోహదంచేస్తాయని, ఈ నెల 15న మహబూబ్ నగర్ గద్వాల్లో ప్రారంభమైన ప్రచార జాత 21న ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలోకి ప్రవేశిస్తుందన్నారు. లక్షలాది మందిని కదలించేందుకు శతాబ్ది ఉత్సవాలు చరిత్రలో నిలిచిపోతాయన్నారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యు లు జమ్ముల జితేందర్‌రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు మహ్మద్ సలాం, పోటు కళావతి, ప గడాల మల్లేష్, మేకల శ్రీనివాసరావు, ఏనుగు గాంధీ, యానాలి సాంబశివరెడ్డి, నూనే శశిధర్, వరదా నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి తుమ్మలను కలిసిన చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు



తుమ్మలను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరిస్తున్న కురివెళ్ల

దమ్మపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఖమ్మం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడిగా ఎంపికైన కురివెళ్ల ప్రవీణ్‌కుమార్, కమర్తపు మురళీతో కలిసి మర్యాదపూర్వకంగా తుమ్మలను కలిసి సత్కరించారు. అనంతరం పలు మండలాలకు చెందిన కాంగ్రెస్ నాయకుల తుమ్మలను కలసి సమస్యలపై పలువురు వినతిపత్రాలు అందజేశారు.

నాట్య విపంచి పురస్కారం సాధించిన త్రివేణి విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

ఖమ్మంఖానాపురంహవేలి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): శ్రీ డాన్స్ అకాడమీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాలల దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన బాల్య నాట్యోత్సవం-25లో ఖమ్మం త్రివేణి పాఠశాల 9వ తరగతికి చెందిన హేమశ్రీ లేఖ, 7వ తరగతికి చెందిన హరిణి కీర్తి, నాట్య విపంచి పురస్కారం సాధించారు. కార్యక్రమం అనంతరం జరిగిన కార్యక్రమంలో హేమశ్రీ లేఖని హరిణి కీర్తిని, ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాలలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి ప్రిన్సిపాల్ రాజేంద్ర ప్రసాద్‌లు విద్యార్థులను అభినందించారు.

డీసీసీలో ఇందిరాగాంధీ జయంతి



ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎంపీ రఘురాంరెడ్డి

ఖమ్మం కార్పొరేషన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): భారతదేశ ప్రధాన మంత్రిగా దివంగత ఇందిరాగాంధీ ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చి బ్యాంకులను జాతీయకరణ చేసి నిరుపేదలకు బ్యాంకింగ్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారని ఎంపీ రఘురాంరెడ్డి పేర్కొన్నారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ అధ్యక్షతన మాజీ ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ జయంతి నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, నగర వర్కింగ్ ప్రెసిడెంట్ నాగండ్ల దీపక్‌చౌదరి, దొబ్బల సౌజన్య, పుచ్చకాయల వీరభద్రం, హుస్సేన్, మెక్కా శేఖర్‌గౌడ్, రాష్ట్ర ఓబీసీ సెల్ సభ్యులు వడ్డేబోయిన నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

పేదల ఇళ్ల కూల్చివేతను నిలిపివేయాలి

ఖమ్మం అర్బన్ నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రకాష్‌నగర్‌లో పేదల ఇళ్ల కూల్చి వేతలను వెంటనే నిలుపుదల చేయాలని సీపీఎం ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై. విక్రమ్ డిమాండ్ చేశారు. ఇండ్ల కూల్చివేతకు మార్కింగ్ చేసిన ప్రాంతాలను బుధవారం సీపీఎం త్రీటౌన్ కమిటీ ఆధ్వర్యంలో పాదయాత్ర జరిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకాష్‌నగర్‌లో గాయత్రి కోల్డ్ స్టోరేజ్ నుంచి శ్రీనివాసనగర్ దాకా రోడ్డును వెడల్పు చేసేందుకు మునిసిపల్ అధికారులు మార్కింగ్ చేశారన్నారు. స్థానిక ప్రజలకు నష్టంకలగని విధంగా వారి ఇండ్లను కూల్చివేయకుండా రోడ్డు వెడల్పుచేయాలన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ యర్రాగోపి, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు యర్రా శ్రీనివాసరావు, త్రీటౌన్ కార్యదర్శి భూక్యాశ్రీనివాసరావు, నాయకులు షేక్ హిమాం, యర్రా రంజిత్, నాయిని నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన అధికారులు

ఖమ్మం కార్పొరేషన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగర పాలక సంస్థకు బదిలీలు, డిప్యూటేషన్ క్యాన్సిల్‌పై వచ్చిన అధికారులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. రెవెన్యూ అధికారిగా జీ. శ్రీనివాసరావు, మేనేజరుగా అనుముల సుధాకర్, రెవెన్యూ ఆఫీసర్‌గా వర లక్ష్మీ బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు కేఎంసీ కమిషనర్ అభిషేక్ ఆగస్త్యను కలిసి బాధ్యతలు తీసుకున్నారు. అలాగే ఖమ్మంలో మేనేజరుగా విధులు నిర్వహిస్తున్న బుచ్చిబాబు సూర్యాపేటకు, ఆర్వోగా పని చేసిన యాకూబ్‌పాషా నేరెడుచర్ల ఆర్వోగా రిలీవ్ అయ్యారు.

న్యూమోనియా వ్యాధిపై అవగాహన

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : న్యూమోనియా వ్యాధిపై జిల్లా వాక్సిన్ మేనేజర్ రమణ మామిళ్ళగూడెం, శ్రీనివాసనగర్, ముస్తఫనగర్ యూపీహెచ్‌సీలలో బుధవారం అవగాహన కల్పించారు. చలి నుంచి జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు నవ్యకృష్ణ, సమీరా, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులను విడుదల చేయాలి

» టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రంజాన్

నేలకొండపల్లి, నవంబరు19(ఆంధ్రజ్యోతి): సుదీర్ఘకాలం పాటు విశిష్టమైన సేవలను అందించి, రిటైర్ అవుతున్న ఉపాధ్యాయులు దాచుకున్న నగదు చెల్లింపుల్లో ప్రభుత్వం తీవ్ర అలసత్వం వహిస్తున్నదని, ఇది సరికాదని, తక్షణమే బకాయిలు చెల్లించటానికి చర్యలు తీసుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు షేక్.రంజాన్ డిమాండ్ చేశారు. బుధవారం నేలకొండపల్లిలో మండల అధ్యక్షురాలు జ్యోతి అధ్యక్షతన జరిగిన మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈనెల 30న కల్లూరులో జరుగనున్న సిల్లా స్థాయి కమిటీ విస్తృత సమావేశాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.వెంగళరావు, కార్యదర్శి తొర్తి గురవయ్య, సురేష్, రావెళ్ళ అరవిందకుమార్, కె.పద్మ, నవాబ్‌సాహెబ్, కరుణశ్రీ, కోటేశ్వరరావు, మండల మాజీ అధ్యక్షుడు మందడపు శ్రీనివాసరావు, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో డ్రైవింగ్ చేయొద్దు

ఖమ్మంక్రైం నవంబరు19(ఆంధ్రజ్యోతి) :మద్యం మత్తులో డ్రైవింగ్ చేయడం వల్ల తమ విలువైన ప్రాణలు కోల్పోవడమే కాక, ఎదుటివారి ప్రాణాలకు ముప్పు తెస్తున్నారని ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు తెలిపారు నగరంలోని ఇటీవల నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో మద్యంమత్తులో వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులు జరిమానా విధించారు. ట్రాఫిక్ పోలీసులు అనంతరం వారికి కౌన్సిలింగ్ ఇచ్చి పంపిచారు. ఈసందర్భగా ఏసీపీ మాట్లాడుతూ నగరంలో మద్యం తాగి డ్రైవింగ్ కేసులు పెరుగుతున్నాయన్నారు. అజాగ్రత్తగా ఉంటే ప్రాణం పోతుందని తెలసినా నిర్లక్ష్యంగా వ్యవహరించడం జరుగుతుందన్నారు.

కాంగ్రెస్ నాయకురాలు రంగమ్మకు నివాళులు

తిరుమలాయపాలెం, నవంబరు19(ఆంధ్రజ్యోతి): మండలంలోని మేడిదపల్లి గ్రామానికి చెందిన మోరవి జయపాల్‌రెడ్డి తల్లి మోర రంగమ్మకు వివిధ పార్టీల నేతలు బుధవారం నివాళులర్పించారు. అనారోగ్యంతో ఆమె మృతిచెందగా దశదిన కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా రంగమ్మ చిత్రపటానికి జిల్లా నాయకుల రామసహాయం నరేష్ రెడ్డి సుమన్‌రెడ్డి, మోహన్‌రెడ్డి రవికాంత్‌రెడ్డి నివాళులర్పించారు

టీడీపీ నేత రామచంద్రు మృతి

మండలంలోని బచ్చోడు గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నేత గొర్రెపాటి రామచంద్రు(58) బుధవారం మృతి చెందాడు. ఆయనమృతదేహాన్ని పార్టీ జిల్లా నాయకులు కొండబాల కరుణాకర్ నామప్రసాద్, ఉండేటి భిక్షం, మల్లెంపాటి లహరిన్ తదితరులు నివాళులర్పించారు.

విద్యార్థుల ఎడ్యుకేషనల్ ట్రిప్

ఖమ్మంఖానాపురంహవేలి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): నగరంలోని శ్రీనగర్ కాలనీ స్టెమ్‌స్పార్క్ రెజొనెన్స్ స్కూల్ విద్యార్థులకు ప్రత్యక్ష అభ్యసన, అనుభవాలు కల్పించుటకు పాఠశాల యాజమాన్యం ఫీల్డ్ ట్రిప్‌లను నిర్వహించారు పాడి పరిశ్రమ, పాలఉత్పత్తి నిల్వచేయడం వంటి అంశాల పైన అవగాహన ప్రత్యక్ష అభ్యసన, అనుభవాలు కల్పించుటకు బుధవారం నగరంలోని తెలంగాణ విజయ డెయిరీ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భ పాఠశాల డైరెక్టర్ కొండా శ్రీధర్‌రావు మాట్లాడారు. తెలంగాణ పాడి పరిశ్రమాభివృద్ధి డిప్యూటీ డైరెక్టర్ కె.రవికుమార్, జూనియర్ ఇంజనీర్ నాగమణిలు విద్యార్థులకు వివిధ అంశాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పీవీఆర్.మురళీమోహన్, ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి కేసులో నిందితులకు 20 ఏళ్ల జైలు

ఖమ్మం లీగల్ నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా తల్లాడ గ్రామానికి చెందిన తమ్మిశెట్టి ఆనంద్, జూలూరుపాడు మండలం కొమ్ముగూడెం గ్రామానికి చెందిన గుగులోత్ బావుసింగ్‌లకు గంజాయి కేసులో 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు నిందితులకు ఒక్కొక్కరికి రూ.లక్ష జరిమానా విధిస్తూ ఖమ్మం మొదటి అదనపు జిల్లా ప్రధాన న్యాయాధికారి కె.ఉమాదేవి బుధవారం తీర్పుచెప్పారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉండటంతో వారిపై విచారణ జరగలేదు. 2020 డిసెంబరు 4న కొణిజర్ల పోలీసులు గద్దలగూడెం గ్రామ సమీపంలో వాహనాలను తనిఖీలు నిర్వహిస్తున్న సందర్భంలో నిందితులు ఆటోలో అనుమానాస్పదంగా ఉండటంతో పోలీసులు వారిని ఆపారు. నిందితులు వైజాగ్‌లో అక్రమ గంజాయిని కొనుగోలు చేసి ఆటోలో తరలిస్తున్న 3 బ్యాగులలో ప్యాక్‌చేసి ఉండటాన్ని గమనించారు. గం జాయి మొత్తం 50కేజీల 800గ్రాములు దాని విలువ 7లక్షల 50వేలుగా ఉంది. నిందితుల దగ్గర గంజాయిని పట్టుకున్నారు. నిందితుల పైన కొణిజర్ల పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. కేసును విచారించిన న్యాయమూర్తి నిందితులపై నేరం రుజువుకావడంతో శిక్ష విధిస్తూ తీర్పుచెప్పారు. ప్రాసిక్యూషన్ తరుపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ జమ్ముల శరత్‌కుమార్‌రెడ్డి వాదించగా లైజనింగ్ అధికారి శ్రీకాంత్, మల్లిఖార్జునరావు, రామారావు, హోంగార్డు ఎం.డి.ఆయూబ్ లు సహకరించారు.

చెల్లని చెక్కు కేసులో ఏడాది జైలు

ఖమ్మం నగరంలోని పాండురంగాపురం ప్రాంతానికి చెందిన కనపర్తి విజయలక్ష్మీకి చెల్లని చెక్కు కేసులో నిందితురాలికి ఏడాది జైలుశిక్షతో పాటు ఫిర్యాదికి రూ.4లక్షల 50వేలు నష్టపరిహారం కింద చెల్లించాలని ఖమ్మం రెండవ అదనపు ప్రథమశ్రేణి కోర్టు న్యాయాధికారి ఏపూరి బిందుప్రియ బుధవారం తీర్పు చెప్పారు. ఖమ్మం నగరంలోని పాండురంగాపురం ప్రాంతానికి చెందిన తోట్ల శీతమ్మ వద్ద నుంచి నిందితురాలు పలు దపాలుగా అప్పుగా తీసుకుంది.. కొంతకాలం తరువాత ఫిర్యాది తన అప్పు తిరిగి చెల్లించమని ఒత్తిడిచేయగా 2021లో చెక్కు ఇచ్చింది. ఫిర్యాది ఆ చెక్కును తన బ్యాంక్ ఖాతాలో జమచేయగా చెక్కు తిరస్కరణకు గు రైంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసులోని సాక్షులను విచారించిన న్యాయాధికారి నేరం రుజువుకావటంతో శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

సమాజాన్ని అభిమానించే జాతిగా ఉండాలి

- జాతి చరిత్రకు కళంకం తీసుకు రావద్దు
- పూర్వీకులు ఇచ్చిన ఘనకీర్తిని కొనసాగించాలి
- కమ్మవారి వనసమారాధనలో మంత్రి తుమ్మల



వన సమారాధనలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

మధిరరూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): సమాజాన్ని అభిమనించే జాతిగా కమ్మవారు ఉండాలని, జాతి చరిత్రకు కళంకం తీసుకు రాకుండా పూర్వీకులు ఇచ్చిన ఘన కీర్తిని కొనసాగించాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. బుధవారం మధిర శివారులోని అత్కూర్ మామిడి తోటలో మధిర కాకతీయ కమ్మసంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వన సమారాధన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జాతి గౌరవాన్ని నిలుపుకోవాలని, అన్ని జాతుల వారు కమ్మవారిని గౌరవిస్తారని తెలిపారు. కష్టపడకుండా ఏది రాదని, పిల్లలను అందరూ కష్టపడి చదివించాలని కోరారు. ఒకప్పుడు వ్యవసాయం మాత్రమే చేసే కమ్మవారు నేడు అన్ని రంగాల్లో అగ్రభాగాన నిలిచిరాని ప్రశంసించారు. తాము చేసిన శాశ్వత పనులే చరిత్రలో నిలిచి పోతాయని తెలిపారు. నాగర్జున సాగర్ ప్రాజెక్టు నిర్మాణానికి బారీగా విరళాన్ని ఇచ్చిన ముక్యాల రాజు లంటి గొప్ప వ్యక్తులు చరితలో శాశ్వతంగా నిలిచి పోయారని పేర్కొన్నారు. సర్గీయ నందమూరి తారక రామారావు తెలుగు వారి అత్మ గౌరవ నినాదంతో తెలుగు నేలపై పార్టీ పెట్టి చరిత్ర సృష్టించారని తెలిపారు. మధిర ప్రాంతంలో విద్యావంతులు అధిక సంఖ్యలో ఉన్నారని, ఏ మారుమూలకు వెళ్లిన మధిర వాసులు ఉద్యోగాల్లో కనిపిస్తారని స్పష్టం చేశారు. ప్రజాహితం కోసం కమ్మవారు పని చేయాలన్నారు. అనంతరం సంఘ నేతలు మంత్రి తుమ్మలను ఘనంగా సన్మానించారు. వన సమారాధన కార్యక్రమానికి భారీ సంఖ్యలో కమ్మం సంఘం నుంచి తరలి వచ్చి మంత్రికి ఘన స్వాగతం పలికారు. సమారాధనలో పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని, మాజీ హోంశాఖా మంత్రి వసంత నాగేశ్వరరావు, ఏపీ కమ్మ కార్పోరేషన్ ఛైర్మన్ నాదెండ్ల బ్రహ్మం చౌదరి, రాష్ట్ర గిడ్డంగుల ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, డీసీసీబీ ఛైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, టీడీపీ జిల్లా పార్లమెంటరీ అధ్యక్షుడు వాసిరెడ్డి రామనాధం, మధిర కమ్మ సంఘ నాయకులు పుతుంబాక కృష్ణ ప్రసాద్, కరివేద వెకటేశ్వరరావు, బీవీఆర్, కరివేద సుదాకర్, చావా రామకృష్ణ, గడ్డం రమేష్, మువ్వా రామకృష్ణ, మల్లాది హన్మంతరావు, కొంగర మురళి, సతీష్, శరత్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

నిధుల కోసం ఎమ్మెల్యే వినతి



మంత్రితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

సత్తుపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి నియోజకవర్గంలో అభివృద్ధి నిమిత్తం రూ.37కోట్లు మంజూరు చేయాలని కోరుతూ రాష్ట్ర పశుసంవర్ధక, పాడి అభివృద్ధి, మత్స్య, క్రీడలు, యువజన సేవలశాఖ మంత్రి వాకిటి శ్రీహరికి సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి కోరారు. బుధవారం హైదరాబాద్‌లోని సెక్రటేరియట్‌లో ఆయన్ను కలిసిన ఎమ్మెల్యే ఎస్‌డీఎఫ్, ఈజీఎస్ కింద రూ.30కోట్లు, నూతనంగా నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ స్కూల్‌తో పాటు రూ.7.20కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న కల్లూరు మండలంలోని యజ్ఞనారాయణపురం నుంచి చెన్నూరు వరకు రోడ్డుకు నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం ద్వారా కోరారు. సానుకూలంగా స్పందించిన ఆయన శాంక్షన్ ఆర్డర్ ఇవ్వాలంటూ కలెక్టర్‌ను ఆదేశించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

సైడ్ కాల్వల మంజూరుకు ఎంపీకి వినతి



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్థులు

కారేపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శివాలయం సమీపంలో సైడ్ కాల్వల ఏర్పాటు కోసం అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరుతూ మండలానికి చెందిన పలువురు గ్రామస్థులు బుధవారం ఖమ్మంలో ఎంపీ రఘురాం రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ ప్రాంతంలో సైడు కాలువలు లేకపోవడంతో ఇబ్బంది కరంగా ఉందని తక్షణమే నిధులు మంజూరుచేసి సైడు కాలువలు ఏర్పాటు చేయాలని కోరారు. మార్కెఫెడ్ మాజీ వైస్ ఛైర్మన్ బోర్ర రాజ శేఖర్ ఆధ్వర్యంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు ఇమ్మడి తిరుపతిరావు, బానోత్ రాంమూర్తి,మల్లెలపాగేశ్వరరావు, గుగులోత్ శ్రీను, హీరాలాల్, భీముడు తొగరశ్రీను, మేదరి రాజా, మద్దబోయిన మల్లేష్ తదితులు పాల్గొన్నారు.

వినియోగదారుల సమస్యలు పరిష్కరించాలి

- సీజీఆర్ఎఫ్ ఛైర్మన్ వేణుగోపాలచారి



వినియోగదారుల సమావేశంలో మాట్లాడుతున్న సీజీఆర్ఎఫ్ ఛైర్మన్

కల్లూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో విద్యుత్ వినియోగదారుల సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించాలని వరంగల్ జోన్ సీజీఆర్ఎఫ్ ఛైర్మన్ ఎస్‌వీ.వేణుగోపాలచారి విద్యుత్ ఉద్యోగులకు సూచించారు. మండలంలో బుధవారం విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వినియోగదారుల నుంచి పలు సమస్యలపై ఫిర్యాదులు వచ్చాయి. వాటిపై స్పందించిన వేణుగోపాలచారి మాట్లాడుతూ.. 15 రోజుల్లోగా ఆయా సమస్యలను అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో సందర్శించి పరిష్కారించాలని కోరారు. గ్రామాల్లో లూజు లైన్లకు స్తంభాలు వేయించాలని, ఏబీ స్విచ్ నియంత్రికలకు ఇనుప కంచెలు ఏర్పాటు చేయాలని, ప్రైవేట్ వ్యక్తులకు విద్యుత్ సరఫరా పనుల్లో అనుమతించొద్దని విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బందికి సూచించారు. మండలంలోని లింగాల గ్రామంలో 3311 కేవి విద్యుత్ సబ్‌స్టేషన్‌ను వచ్చే మార్చి నాటికి పూర్తి చేస్తామన్నారు. విద్యుత్ శాఖ పరమైన పనుల విషయంలో ఎవరికి ఎలాంటి నగదు ఇవ్వరాదని, విద్యుత్ సర్వీసుల అనుమతుల విషయంలో మీసేవ ద్వారా ఫీజులు చెల్లించినచో శాఖ ద్వారానే నేరుగా అనుమతులు వస్తాయన్నారు. విద్యుత్ వి నియోగం తేలికగా ఉన్న ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. విద్యుత్ సమస్యలు ఏమైన ఉంటే 1912 టోల్‌ఫ్రీ నెంబర్లకు ఫోన్ చేస్తే సిబ్బంది వెంటనే స్పందిస్తారని ఆయన వినియోగదారులకు విజ్ఞప్తి చేశారు. ఈ పరిష్కార వేదిక సమావేశంలో సత్తుపల్లి డిఈ శ్రీరాములు, ఎస్ఏఓ శ్రీధర్, ఖమ్మం ఏడి, కల్లూరు, పెనుబల్లి పెద్దకోరుకొండి ఏఈలు వెంకట్, శీలం రామిరెడ్డి, రవితేజ, భుజయేందర్ కుమార్, ఆయా సర్కిల్స్ పరిధిలో గల విద్యుత్ శాఖ సిబ్బందిలు, వినియోగదారుల తరుపున కల్లూరు మాజీ జడ్పీటీసీ కట్టా అజయ్‌కుమార్, టీ వెంకటాపురం మాజీ సర్పంచు తోటకూర శేషగిరిరావు, వినియోగదారుల సంఘం నాయకులు నల్లజాల మంగపతిరావు, బొప్పన రామరావు, మద్దినేని శ్రీనివాసరావు, చీకటి రామారావు, బండి వీరబాబు, నాయుడు రాఘవరావు, శివ, దొడ్డపునేని కృష్ణయ్య పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి

వైరా నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వైరా మున్సిపాలిటి పరిధిలో మౌలిక సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక బోడేపూడి వెంకటేశ్వరరావు భవనంలో పార్టీ పట్టణ నాయకులు పైడిపల్లి సాంబశివరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. అధికారుల పరిపాలనలో ప్రభుత్వం సక్రంగా నిధులు కేటాయించక పోవడంతో విలీనగ్రామాలతోపాటు వైరాలో ప్రజలు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని ఆయన అన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు సుంకర సుధాకర్, పట్టణ కార్యదర్శి చింతనిప్పు చలపతిరావు,హరి వెంకటేశ్వర్లు, సంక్రాంత్రి నర్సయ్య, మోహన్‌రావు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ

వైరా నవంబరు19(ఆంధ్రజ్యోతి): వైరాలో బుధవారం నూకల శ్రీనివాసరావు పుట్టిన రోజును పురష్కరించుకొని లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 40మంది పేదలకు దుప్పట్లను వైరా ఏఎంసీ ఛైర్మన్ బోళ్ల గంగారావు పంపిణీచేశారు. విశేశ్వరరావు, పెరుమళ్ళ కృష్ణమూర్తి, కట్టా కృష్ణార్జనరావు,చింతలపూడి వెంకటేశ్వరరావు,నూకలప్రసాద్‌రావు, అన్నపూర్ణ, కృష్ణమూర్తి మణి, మిట్టపల్లి కిరణ్‌కుమార్, రంగా రమేష్, రాఘవరావు, పాల్గొన్నారు.



ఇంటర్న్‌షిప్‌కు 'మదర్‌థెరిస్సా' విద్యార్థి ఎంపిక

సత్తుపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): బ్రాడ్‌రిడ్జ్ ఫైనాన్షియల్ సోల్యూషన్స్ (ఇండియా) ప్రవేట్ లిమిటెడ్ కంపనీలో ఇంటర్న్‌షిప్‌కు మండలంలోని కొత్తూరులోని మదర్ థెరిస్సా కళాశాల విద్యార్థి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ చలసాని హరికృష్ణ బుధవారం తెలిపారు. సీఎస్‌ఈ విభాగం నుండి బీటెక్ ఫైనలీయర్ చదువుతున్న పిదమర్తి సాయి వైభవ్ కుమార్ నెలకు రూ.25వేల చొప్పున వేతనం లభించనుందని, క్రమశిక్షణతో కూడిన విద్యాబోధనతోనే సాధ్యమైందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థి మాట్లాడుతూ కమ్యూనికేషన్ స్కిల్స్ సాఫ్ట్‌స్కిల్స్, ఆర్థమెటిక్, రీజనింగ్, కోడింగ్‌లపై అధ్యాపకులు ప్రత్యేకశ్రద్ధతో నేర్పించారన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్‌తో పాటు సెక్రటరీ, కరస్పాండెంట్ చలసాని సాంబశివరావు, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎంవీ.రామచంద్రరావు, సీఎస్‌ఈ విభాగాధిపతి పీ.మారేశ్వరరావు, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ టీ.రాఘవరాజు, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది అభినందనలు తెలిపారు.

భగవద్గీత పఠనంలో బంగారు పతకం



సత్తుపల్లిరూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మైసూరు దత్తపీఠం ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన భగవద్గీత పఠన పోటీలో అసమాన ప్రతిభ కనబరిచిన ఓ మహిళ బంగారు పతకం సాధించారు. సత్తుపల్లి మండలం బేతుపల్లిలోని అంకమ్మతల్లి ఆలయ అర్చకస్వామి సతీమణి వేణునూతల మౌనిక ఇటీవల ఆన్‌లైన్‌లో నిర్వహించిన పఠనపోటీలలో పాల్గొనగా బంగారు పతకం సాధించినట్లు ఆమె బుధవారం తెలిపారు. భగవద్గీతలోని 18అధ్యాయాలలోని 700శ్లోకాలను కంఠస్థం చేయడంతో ఆమె ఈ ఘనత సాధించారు. ఈ సందర్భంగా మైసూరు దత్తపీఠాధిపతి సచ్చిదానంద స్వామి చేతులమీదుగా పతకం అందుకోనుండగా ఈ విజయాన్ని తన గురువు మాడుగుల రమ్యకు అంకితమిస్తున్నట్లు మౌనిక ప్రకటించారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న నాగేశ్వరరావు

ఏన్కూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యల పరిష్కారించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరారవు ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. బుధవారం ఏన్కూరులో మండల మహాసభ నినర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ, ఉద్యోగులసమస్యలను వెంటనే పరిష్కరించాలని బకాయిపడిన ఐదు డీఏలను, పీఆర్సీనివేదికను వెంటనే అమలుచేయాలన్నారు. ఇన్‌సర్వీసు ఉపాధ్యాయులకు టెట్‌నుండి మినహాయింపు ఇవ్వాలని నూతన పింఛణ్‌విధానం కొనసాగించాలన్నారు. ఈకార్యక్రమలో సంఘం జిల్లా నాయకులు డీఎస్ నాగేశ్వరరావు, బానోతు రాందాస్ పాల్గొన్నారు. అనంతరంమండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా బానోతు రామచంద్, ప్రధాన కార్యదర్శిగా మూడ్ పుల్లయ్య, ఉపాధ్యక్షులుగా వి.శ్రీదేవి, జే.పుల్లయ్య, కోశాధికారిగా బి.నరసింఆరావు, ఎన్నికయ్యారు. లక్ష్మికుమారి, రాఘవరావు, శంకరరావు, ఎం.నాగేశ్వరావు, శ్యాంకుమార్, హతిరామ్, విజేత, అనసూయ, నిర్మల పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలిగా.. జడ్పీసీఈవో

ముదిగొండ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయురాలిగా మారి జిల్లా పరిషత్ సీఈవో విద్యార్థులకు పాఠాలు బోధించారు. మండలంలోని మాదాపురం ప్రాథమిక పాఠశాలలో ఎర్లీచైల్డ్ హుడ్ ఫస్ట్ ప్రాజెక్టు కార్యక్రమాన్ని జడ్పీసీఈవో దీక్షారైనా పరిశీలించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధించే పద్ధతితోపాటు విద్యార్థులకు అర్థమవుతుందా లేదా అని విషయాలు తెలుసుకున్నారు. ప్రారంభ బాల్య అభివృద్ధి సేవలను మెరుగుపరచడంపై ప్రభుత్వం దృష్టిపెడుతుందని ఉపాధ్యాయులు బాధ్యత నిర్వహించలన్నారు.



పిల్లలకు పాఠలు భోదిస్తున్న సీఈవో

విద్యార్థి దశనుంచే క్రమశిక్షణతో మెలగాలి



సత్తుపల్లి బాలికల హైస్కూల్‌లో మొక్క నాటుతున్న మునిసిపల్ కమిషనర్ నరసింహ

సత్తుపల్లిరూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణతో మెలుగుతూ సామాజిక సేవలో భాగస్వాములై ఉత్తమ పౌరులుగా ఎదగాలని సత్తుపల్లి మునిసిపల్ కమిషనర్ కొండ్రా నరసింహ అన్నారు. కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవెల్యూషన్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని బాలికల హైస్కూల్‌లో ఏర్పాటుచేసిన స్కూల్ ఎర్త్ క్లబ్ యంగ్ ఎర్త్ లీడర్స్ ప్రోగ్రామ్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో నూతనంగా నిర్మించిన ఇంకుడు గుంతను ప్రారంభించిన అనంతరం ఔషదగుణాలతో కూడిన మొక్కను నాటారు. పాఠశాల అభివృద్ధి చెందాలంటే సమాజ భాగస్వామ్యం ఉండాలని, అప్పుడే పాఠశాలతో పాటు విద్యార్థులు అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతారన్నారు. ప్రభుత్వ, ప్రయివేట్ కార్యాలయాలు, విద్యాసంస్థలలో తప్పనిసరిగా ఇంకుడుగుంతలు ఏర్పాటు చేసి భూగర్భజలాలు పెంచేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నీరుడు నాగేశ్వరరావుతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థినీలు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రాయల

ముదిగొండ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దమండవ గ్రామంలో శ్రీఉషోదయ గ్రామ సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్ర గిడ్డంగుల సంస్థచైర్మన్ రాయల నాగేశ్వరరావు, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రాయల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. రైతుల పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలన్నారు. దళారులను ఆశ్రయించి మోసపోవద్దన్నారు. ప్రభుత్వం సన్నకం ధాన్యానికి రూ.500బోనస్ చెల్లిస్తుందన్నారు. ఈకార్యక్రమంలో మండల నాయకులు కోడేనాగేశ్వరరావు, మాజీ ఉపసర్పంచ్ కోడే బాబు. ఐకేపీ సీసీ సీహెచ్ వీ.రామారావు, మత్కేపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ పరసగాని తిరుపతిరావు, మాజీ ఎంపీటీసీ కుక్కల వెంకశరావు తదితరులు పాల్గొన్నారు.

వైకుంఠధామం అభివృద్ధి పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న ఎంపీడీవో భాగ్యశ్రీ

ఏన్కూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కేసుపల్లి గ్రామానికి చెందిన శెట్టిపల్లి నారాయణ, బసవమ్మ మెమోరియల్ ట్రస్టు ద్వారా ఏన్కూరు వైకుంఠధామం అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. ఈ పనులను ఎంపీడీవో పల్లిభాగ్యశ్రీ బుధవారం ప్రారంభించారు. స్మశానవాటికలో ముళ్లపొదలతో అధ్వన్నంగా ఉండడాన్ని చూసి ఖమ్మంకు చెందిన ట్రస్టు నిర్వాహకులు డాక్టర్ శెట్టిపల్లి నాగేశ్వరావు అభివృద్ధి చేసేందుకు ముందుకు వచ్చారు. గ్రామస్థుల కోరిక మేరకు ముళ్లపొదల తొలిగింపు, నీరు నిలవకుండా కాల్వలు తవ్వకం, మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు నాగేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ సెక్రటరి బజారు, పంచాయతీ కార్యదర్శి కృష్ణ, ట్రస్టు సభ్యులు కడియాల కోటేశ్వరావు, గ్రామస్థులు కొప్పూరి నాగేశ్వరరావు, మేడ దర్మారావు, ముదిగొండ నాగేశ్వరారవు, మాదినేని నరసింహారావు దొంతబోయిన నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు చేప పిల్లల పంపిణీ



మత్స్యకారులకు చేప పిల్లలను పంపిణీ చేస్తున్న ఏఎంసీ ఛైర్మన్ నీరజదేవి

కల్లూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కల్లూరులో బుధవారం ఏఎంసీ ఛైర్మన్ బాగం నీరజదేవి మత్స్య కార్మికులకు సబ్సీడిపై ఉచితంగా చేపపిల్లలను పంపిణీ చేశారు. మండల పరిధిలో గల కల్లూరు, చంద్రుపట్ల, పేరువంచ, చెన్నూరు, పెద్దకోరుకొండి సోసైటీల పరిధిలో గల పది గ్రామాలకు చెందిన మత్స్య కార్మికులకు సుమారు 5 లక్షల వరకు ఉచితంగా చేప పిల్లలను అందజేశారు. సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి చొరవతో కార్మికులకు ఉచిత చేప పిల్లలు పంపిణీ చేయడం పట్ల కార్మికులు వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మత్స్య కార్మిక సంఘాల అధ్యక్షులు మరసకట్ల బాలశౌరి, చింతకాయల వెంకటేశ్వరరావు, రామోజి, చిన్న సైదులుతోపాటుగా మత్స్య పరిశ్రమలశాఖ ఎఫ్ఏ బెనర్జిబాబు, అసిస్టెంట్ టి రాజేష్, రమష్, నడికొప్పు నరిసింహారావు, కాంగ్రెస్ నాయకుడు బాగం ప్రభాకర రావు, పలు గ్రామాల కార్మికులు పాల్గొన్నారు.

బకాయి వేతనాల కోసం కార్మికుల వినతి



వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

కల్లూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కల్లూరులో మునిసిపాలిటీ కార్మికులు బకాయి వేతనాలు అందించాలని డిమాండు చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో బుధవారం ధర్నా చేసి విన్నపించారు. గత ఆరు నెలలుగా వేతనాలు అందక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే వేతనాలు అందించాలని వారు మునిసిపాలిటీ కార్యాలయం ముందు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏఐటియూసీ జిల్లా ఉపాధ్యక్షుడు వేము రాంబాబు మాట్లాడుతూ.. వేతనాలు అందక పోవడంతో కార్మికుల కుటుంబాలు గడవడం కష్టంగా ఉందన్నారు. ఆర్థిక భారంతో కుటుంబ భారం మోయలేక కార్మికులు ఆందోళన చెందుతున్నారని చెప్పారు. పెరుగుతున్న ధరలకు అణుగుణంగా నిత్యవసరాలు కొనుగోలు చేయలేక ఇబ్బందులు పడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆరు నెలలు గడిచిన ప్రభుత్వం వేతనాల చెల్లింపులో నిర్లక్ష్యం చూపుతుందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే దశల వారిగా ఆందోళనకు సిద్దమవుతున్నామని చెప్పారు. ఈ సందర్భంగా సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని మునిసిపాలిటీ కమిషనర్ సంపత్‌కుమార్‌కు కార్మికులు అందించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల నాయకులు దామాల దయాకర్‌రావుతో పాటుగా కార్మికుల సంఘం నాయకుడు ఊడల కృష్ణమూర్తి, కార్యదర్శి వజీర్‌మీయా, నాయకులు ప్రకాష్, సుధాకర్, చిన్నమణికుమార్ పాల్గొన్నారు.

ఘనంగా ఇందిరాగాంధీ జయంతి

భారతతొలి మహిళ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ జయంతి వేడుకలను బుధవారం వైరాలో జరుపుకున్నారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు.



వైరాలో ఇందిరాగాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



మధిరలో..



బోనకల్‌లో..

పాఠశాలకు భూమి పూజ

చింతకాని, నవంబరు (19): మండల పరిధిలోని నాగులవంచ గ్రామంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిర్మాణానికి బుధవారం భూమి పూజ నిర్వహించారు. పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించే లక్ష్యంతో ప్రభుత్వం తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిర్మాణాలకు శ్రీకారం చుట్టిందన్నారు. పైలెట్ ప్రాజెక్టులో భాగంగా నాగులవంచ గ్రామంలో స్కూల్ నిర్మాణం చేపడుతున్నట్లు మత్కేపల్లి మార్కెట్ కమిటీ ఛైర్మన్ అంబటి వెంకటేశ్వర్లు తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కనపర్తి వెంకటేశ్వర్లు, ఏఈ గంగా ప్రసాద్, మాజీ సర్పంచ్ కంభం వీరభద్రం, ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

జాతీయస్థాయిలో పినపాక విద్యార్థి ప్రతిభ

తల్లాడ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి వ్యాసరచన పోటీల్లో మండలంలోని పినపాక గ్రామానికి చెందిన షేక్ ఆసిఫ్ ప్రతిభ చాటాడు వచ్చేనెలలో న్యూఢిల్లీలో రాష్ట్రపతి చేతులమీదుగా ఆసిఫ్ గోల్డ్‌మెడల్ అందుకోనున్నాడు. పోయినేడు సెప్టెంబరు నెలలో టాటా బిల్డ్ నేషన వ్యాసరచన పోటీల్లో ఆసిఫ్ వ్యాసం ఉత్తమ వ్యాసంగా ఎంపికయింది. టాటా సంస్థ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా నిర్వహించిన పోటీలోల వేలాదిమంది విద్యార్థులు పాల్గొన్నారు.

సీపీఐ సీనియర్ నాయకుడి మృతి

ఏన్కూరు, నవంబరు19(ఆంధ్రజ్యోతి): ఏన్కూరుకు చెందిన సీపీఐ సీనియర్ నాయకుడు మేడా భూషయ్య(80) అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఖమ్మంలోని ప్రైవేటు ఆసుపత్రిలో బుధవారం మృతిచెదాడు. భూషయ్య, గ్రామ, మండల, జిల్లా రైతు సంఘం నాయకుడిగా నిబ్దదతతో పనిచేశారు. ఆయన మృతికి సీనియర్ నాయకుడు పువ్వాడ నాగేశ్వరావు, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాగ హేమంతరావు, జిల్లా కార్యదర్శి దండిసురేష్, మండల కార్యదర్శి రంజిత్‌కుమర్ సంతాపం తెలిపారు.

యాసంగి వరి సాగుపై కొరవడిన స్పష్టత

- అయోమయంలో అన్నదాతలు

వైరా, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వైరా మండలంలో రబీ వ్యవసాయ సాగుపై ప్రభుత్వం నుంచి స్పష్టత కరువైంది. దాంతో రబీ సాగుపై రైతుల్లో అయోమయం నెలకొంది. యాసంగి సీజన్ మొదలై రెండునెలలవుతున్నా ఇంతవరకు ప్రభుత్వం నుంచి స్పష్టమైన ప్రకటన వెలువడలేదు. ముఖ్యంగా వైరా రిజర్వాయర్ ఆయకట్టు రైతాంగం ఈ సాగుపై గందరగోళంలో కొట్టుమిట్టాడుతున్నారు. అయినప్పటికీ స్థానిక ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్, వ్యవసాయ, నీటిపారుదలశాఖ అధికారులు ఈ యాసంగి సాగుపై ఇప్పటికైనా స్పష్టమైన ప్రకటన చేయాలని రైతులు కోరుతున్నారు. వైరా రిజర్వాయర్ కింద ఖరీఫ్‌లో సాగుచేసిన వరికోతలు మొదలయ్యాయి. ఈ దశలో రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టంతో నిండుకుండలా ఉంది. మరోవైపు ఎన్నెస్పీలో పుష్కలంగా నీరుంది. యాసంగికి సాగునీటి సమస్య ఉండబోదని స్పష్టమవుతోంది. వైరా మండలంలో వానకాలంలో సాగుచేసిన పంటలు అతివృష్టితో తీవ్రంగా దెబ్బతిన్నాయి. ముఖ్యంగా పెసర రైతులు పూర్తిగా నష్టపోయారు. అధిక వర్షాలతో పత్తి రైతులు ఆశలు అడిశయాలయ్యాయి. పెట్టిన పెట్టుబడుల్లో కూడా సగం కూడా రైతు చేతికి రాలేదు. నష్టాలే మిగిలాయి. మొంథా తుఫాన్ కారణంగా వరిపంట దెబ్బతిన్నది. దిగుబడులు భారీగా పడిపోయాయి. దాంతో రైతులు తీవ్ర నష్టాలను చూస్తున్నారు. ఈ యాసంగిలోనైనా మొక్కజొన్న, వరి పంటలను సాగుచేసుకుని నష్టాల నుంచి కొంతమేరైనా గట్టెక్కాలని రైతులు ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే వ్యవసాయశాఖ రబీ ప్రణాళికను సిద్ధం చేసింది. 15వేల ఎకరాల్లో వరి, మూడున్నర వేల ఎకరాల్లో మొక్కజొన్న రైతులు సాగుచేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు వ్యవసాయశాఖ అంచనా వేసింది. ఇప్పటికే 60శాతం మంది రైతులు అంటు 2100ఎకరాల్లో మొక్కజొన్న సాగుచేశారు. యాసంగి సాగులో నీటి విడుదలపై ఒక స్పష్టతనివ్వాలని కోరుతున్నారు.



నిండు కుండల వైరా రిజర్వాయర్



మొంథా తుఫాన్‌లో పడిపోయిన వరిపంట